@vaartanews @mvnewstv www.mivaartanews.com
TGBIL/25/A0512
మన వార్త
AP EDITION
ప్రతి అక్షరం... ప్రజల కోసం
విజయవాడ
గురువారం 17 సెప్టెంబర్ 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-

వార్త
విలేకరులు కావలెను
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
96763 94932

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




## మెటాను ఇక సాధారణ మధ్యవర్తిగా పరిగణించలేం

- మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిందే’
- కేంద్రం కీలక ప్రకటన!
- మెటాను ఇక సాధారణ ఇంటర్మీడియరీగా చూడలేమన్న ప్రభుత్వ వర్గాలు
- లీగల్ ఇమ్యూనిటీపై తుది నిర్ణయం న్యాయస్థానాలదేనని వ్యాఖ్యలు



# లక్ష్యాలు చేరకపోతే సమావేశాలెందుకు?



- ఎస్ఎల్‌బీసీ సమావేశంలో చంద్రబాబు
- 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం
- అన్ని వర్గాలను బలోపేతం చేసేలా రుణాలు అందించాలని బ్యాంకర్లకు చంద్రబాబు సూచన
- రుణాల మంజూరులో కొన్ని బ్యాంకులు వెనుకబడటంపై సీఎం అసంతృప్తి
- రుణాల చెల్లింపులో ఎస్హెచ్‌జీ మహిళలు దేశంలోనే నంబర్-1 అని ప్రశంస
- పీఎం సూర్యఘర్ పథకానికి పెద్దఎత్తున రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి
- కౌలు రైతులకు రుణసాయం పెంచాలని బ్యాంకులకు దిశానిర్దేశం

**అమరావతి**

రాష్ట్రంలోని అన్ని రంగాలను, వర్గాలను బలోపేతం చేసేలా రుణాలను అందించాలని, లక్ష్యాలను చేరుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బ్యాంకర్లకు పిలుపునిచ్చారు. అమరావతిలో బుధవారం జరిగిన 236వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో ఆయన పాల్గొని, వివిధ అంశాలపై అధికారులకు, బ్యాంకర్లకు కీలక దిశానిర్దేశం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోలేనప్పుడు ఇలాంటి సమావేశాలు నిర్వహించి ప్రయోజనం ఏముంటుందని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. “సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) రుణాల మొత్తం గతంతో పోలిస్తే పెరిగినప్పటికీ, ఆశించిన స్థాయిలో మంజూరు జరగలేదు. కొన్ని బ్యాంకులు ఇంకా వెనుకబడే ఉన్నాయి. ఈ పరిస్థితి మారాలి” అని అన్నారు. పీఎం సూర్యఘర్ పథకంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యం ఉందని, ఇందుకు బ్యాంకులు పెద్దఎత్తున రుణాలు అందించి సహకరించాలని కోరారు. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలు రుణాల చెల్లింపులో - మిగతా3లో




## లింగ సమానత్వ సూచీలో 131వ స్థానంలో భారత్

- ‘గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్- 2026’ను విడుదల చేసిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్
- 131వ స్థానంలో నిలిచిన భారత్
- వరుసగా 16వసారి తొలి ర్యాంకు దక్కించుకున్న ఐస్‌లాండ్

## గత ప్రభుత్వంలో పెట్టిన దొంగ కేసులన్నీ ఎత్తివేస్తాం

- భారతి రెడ్డిపై పోస్ట్ పెడితే మా కార్యకర్తనే జైలుకు పంపా
- మహిళల వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించడాన్ని సహించబోమన్న లోకేశ్
- భారతి రెడ్డిపై పోస్ట్ పెట్టిన టీడీపీ కార్యకర్తను జైలుకు పంపించానని వెల్లడి
- డీఎస్సీపై చర్చకు రావాలంటూ జగన్‌కు సవాల్ విసిరిన లోకేశ్
- కోవూరులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న లోకేశ్

**అమరావతి**

రాజకీయాల్లో మహిళల వ్యక్తిగత ప్రతిష్ఠను కించపరిచే చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని, ఆ బాధ ఎలా ఉంటుందో తాను ప్రత్యక్షంగా చూశానని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఒక మహిళగా తన తల్లి భువనేశ్వరి అసెంబ్లీలో అవమానానికి గురైనప్పుడు ఎంతటి వేదన అనుభవించారో తనకు తెలుసని, అలాంటి పరిస్థితి మరే మహిళకూ రాకూడదనేదే తన లక్ష్యమని అన్నారు. వైఎస్ భారతి రెడ్డి గురించి సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టినందుకు సొంత పార్టీ కార్యకర్తనే జైలుకు పంపించానని లోకేశ్ వెల్లడించారు. రాజకీయాలు, కుటుంబాలు వేరని, తమ పార్టీ మహిళల జోలికి - మిగతా3లో

## భారత్, అమెరికా ఉమ్మడి సైనిక విన్యాసాలు

- ఔలి కొండల్లో డ్రోన్లు, ఆధునిక ఆయుధాలతో డ్రిల్స్
- ఉత్తరాఖండ్‌లో ‘యుద్ధ అభ్యాస్-2026’ 22వ ఎడిషన్ ఉమ్మడి సైనిక విన్యాసాలు
- డ్రిల్స్‌లో పాల్గొన్న 600 మంది సైనిక సిబ్బంది
- రాజస్థాన్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఆధునిక ఆయుధ వ్యవస్థల ప్రదర్శన




## ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా
# నటిస్తున్నారు

- ఈ ఆదేశాలు ఎవరిచ్చారు?: జగన్
- చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు
- ఎఫ్‌బీఐగా నటిస్తూ ఏపీ పోలీసులు సోషల్ మీడియా పోస్టులను తొలగించాలని కోరారని వెల్లడి
- ఇది ప్రభుత్వ ప్రాయోజిత మోసమంటూ జగన్ విమర్శ
- ఈ చర్యతో ఏపీ పరువు తీశారంటూ మండిపడ్డ మాజీ సీఎం
- హామీల అమలుపై దృష్టి పెట్టాలని ప్రభుత్వానికి హితవు



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ పోలీసులు అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) అధికారులమంటూ నటిస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సంచలన ఆరోపణలు చేశారు. సోషల్ మీడియా పోస్టులను తొలగించేందుకు రాష్ట్ర పోలీసులు ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణమని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో జరుగుతున్న ప్రభుత్వ స్పాన్సర్డ్ మోసమని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఆయన ‘ఎక్స్’ వేదికగా స్పందించారు. “చంద్రబాబు గారి రెడ్ బుక్ పాలన ఇప్పుడు ప్రపంచస్థాయికి చేరింది. ఇప్పుడు ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు! ఇది నకిలీ గుర్తింపు, కానీ ప్రజాస్వామ్యానికి నిజమైన ముప్పు” - మిగతా3లో




## మక్కాపై డ్రోన్ దాడి యత్నం.. స్పందించిన భారత్

- మక్కా సమీపంలో డ్రోన్ దాడి యత్నంపై భారత్ ఆందోళన
- దాడిని విజయవంతంగా తిప్పికొట్టిన సౌదీ అరేబియా
- ఇది ఉగ్రచర్యేనని, రెచ్చగొట్టే ప్రయత్నమని సౌదీ ప్రకటన
- సౌదీ సార్వభౌమాధికారంపై దాడులను ఖండించిన భారత్

## ఏపీలో 5 వేల శ్రీవారి
# ఆలయాలు నిర్మిస్తాం

- ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా తిరుమల
- ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు
- తిరుమలను పవిత్రమైన దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా అభివద్ధి చేయడమే లక్ష్యం



**తిరుమల**

రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణమే లక్ష్యమని సీఎం చంద్రబాబు వెల్లడించారు. బుధవారం తిరుమలలో పలు అభివద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్--1 వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం, రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. తిరుమలను పవిత్రమైన దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా అభివద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. తిరుమలలో భక్తులకు మెరుగైన అనుభూతిని అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆధ్యాత్మికత, సేవాభావం, ఆధునిక సాంకేతికతను సమన్వయం చేస్తామని చెప్పారు. తిరుమల కొండల్లో 89.5 - మిగతా3లో

## కన్నడ లెజెండ్ అనంత్ నాగ్‌కు ‘దాదాసాహెబ్ ఫాల్కే’ పురస్కారం

- భారతీయ సినిమాకు చేసిన సేవలకుగాను ఈ పురస్కారం..
- సెప్టెంబర్ 22న గుజరాత్‌లో అవార్డు ప్రదానం
- అనంత్ నాగ్‌ను అభినందించిన ప్రధాని నరేంద్ర మోదీ
- 300కి పైగా చిత్రాలు, ‘మాల్గుడి డేస్’తో దేశవ్యాప్త గుర్తింపు



# మెటాను ఇక సాధారణ మధ్యవర్తిగా పరిగణించలేం




ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ పేరెంట్ కంపెనీ మెటాకు సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియా వేదికలపై వినియోగదారులకు ఏ కంటెంట్ లేదా సమాచారం ఎక్కువగా కనిపించాలో/చేరాలో నిర్ణయించడానికి అల్గారిథమ్స్ ఉపయోగిస్తున్నప్పుడు, మెటాను కేవలం సమాచారం చేరవేసే సాధారణ మధ్యవర్తిగా (ఇంటర్మీడియరీ) చూడలేమని ప్రభుత్వ వర్గాలు బుధవారం స్పష్టం చేశాయి. అదొక సర్వీస్ ప్రొవైడర్ కిందికి వస్తుందని, అలానే పరిగణించాలని పేర్కొన్నాయి. మిగతా సర్వీస్ ప్రొవైడర్ల మాదిరిగానే మెటాకు కూడా చట్టపరంగా ఎన్నో బాధ్యతలు ఉంటాయని, ఇక మీదట తన ప్లాట్‌ఫామ్ కంటెంట్ విషయంలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంటుందని వెల్లడించాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారతీయ చట్టాల ప్రకారం సోషల్ మీడియా కంపెనీలకు లభించే సేఫ్ హర్బర్ ఇమ్యూనిటీ లేదా చట్టపరమైన రక్షణపై కీలక వ్యాఖ్యలు చేసింది. మెటా తన ప్లాట్‌ఫామ్‌లో కంటెంట్ వ్యాప్తిని నియంత్రిస్తున్నందున, దానికి లీగల్ ఇమ్యూనిటీ వర్తించదని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఇక్కడ చట్టపరమైన సంరక్షణకు సంబంధించి తుది నిర్ణయం న్యాయస్థానాల చేతుల్లోనే ఉంటుందని, అది వాటి పరిధిలోని అంశం అని స్పష్టం చేసింది. ఇప్పటికే ప్లాట్‌ఫామ్‌లోని లోపాలను, కంటెంట్ నియంత్రణలో జరిగిన పొరపాట్లను మెటా బహిరంగంగా ఒప్పుకుందని, ఈ క్రమంలోనే ఇప్పుడు మరింత జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని పేర్కొంది. 'ప్రతి సర్వీస్ ప్రొవైడర్‌కు కొన్ని బాధ్యతలు ఉంటాయి. మెటా తన ప్లాట్‌ఫామ్‌లో ఉన్న కంటెంట్‌కు బాధ్యత వహించేందుకు అంగీకరించిన తర్వాత నెక్ట్స్ ఫేజ్‌లో మరిన్ని బాధ్యతలు కూడా తీసుకోవాల్సి ఉంటుంది' అని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

**నేరుగా 14జ సైబర్ క్రైమ్ పోర్టల్‌కే సమాచారం!**

అంతకుముందు ఆన్‌లైన్‌లో బాలల లైంగిక వేధింపుల కంటెంట్‌పై మెటా తన తప్పును అంగీకరించిందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇక మీదట ఇలాంటి కంటెంట్‌పై భారతీయ సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందిస్తామని మెటా హామీ ఇచ్చింది. డిజిటల్ వేదికల్లో పిల్లల భద్రతకు మరింత ప్రాధాన్యం ఇస్తామని, నేరస్థుల్ని చట్టం ముందు నిలబెట్టడానికి ఈ విషయంలో భారత ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని మెటా అధికార ప్రతినిధి వెల్లడించారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై పిల్లల్ని రక్షించడం తమకు అత్యంత ప్రాధాన్యమైన అంశమని తెలిపారు. కేంద్ర హోం శాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (14జ) నిర్వహిస్తున్నటువంటి సైబర్ క్రైమ్ పోర్టల్‌కు చిన్నారుల భద్రతకు సంబంధించిన కేసుల్ని నేరుగా నివేదించేందుకు మెటా అంగీకరించింది.

ఇప్పటివరకు ఇలాంటి చైల్డ్ సేఫ్టీకి సంబంధించిన కేసుల్ని మెటా అమెరికాకు చెందిన 'నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లోయిటెడ్ చిల్డ్రెన్ సంస్థకు రిపోర్ట్ చేసేది. ఇప్పుడు భారత్‌లోని చట్టాలకు అనుగుణంగా ఇక్కడ భారతీయ పోర్టల్‌కే సమాచారం ఇచ్చేందుకు ఒప్పుకుంది. అయితే ఇక్కడ భారతదేశంలో చట్ట అమలు సంస్థలకు నేరుగా రిపోర్ట్ చేసేందుకు అంగీకరించిన తొలి గ్లోబల్ టెక్ దిగ్గజం మెటానే కావడం విశేషం.

**నిబంధనలు పాటించకపోతే అంతే సంగతులు!**

భారత్‌లో ఆన్‌లైన్ భద్రత, చైల్డ్ అబ్యూస్ కంటెంట్, డీప్‌ఫేక్స్‌పై కేంద్ర ప్రభుత్వం ఇటీవల మరింత నిఘాను పెంచింది. నిబంధనలు పాటించకపోతే ఏమాత్రం ఊరుకునేది లేదని హెచ్చరిస్తూ మెటా అంతర్జాతీయ ఉన్నతాధికారులను కొద్ది రోజుల కిందట భారత్‌కు పిలిపించి కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ విచారించింది. ఇన్‌స్టాగ్రామ్ పెయిడ్ యాడ్స్ ద్వారా చిన్నారుల అశ్లీల కంటెంట్‌ను (చైల్డ్ అబ్యూస్ మెటీరియల్) ప్రోత్సహిస్తున్నారని, ప్రచారం చేస్తున్నారన్న వార్తలపై జులైలోనే ప్రభుత్వం మెటాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తక్షణమే ఆ ప్రకటనలను తొలగించి వివరణ ఇవ్వాలని కూడా ఆదేశించింది. జులై 3న జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైడ్స్- చీజూజ=) కూడా సుమోటా కింద మెటాకు నోటీసులు జారీ చేసింది. మెటా సమాధానం సంతృప్తికరంగా లేకపోవడంతో పూర్తి స్థాయి విచారణకు ఆదేశించింది. అంతేకాకుండా ఇక్కడ మెటా ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, హెడ్‌ను వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని సమన్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వారం వ్యవధిలోనే రెండోసారి మెటా ఇండియా అధికారులు బుధవారం రోజు కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యారు.

# భారత్, అమెరికా ఉమ్మడి సైనిక విన్యాసాలు




భారత్, అమెరికా సైన్యాల మధ్య వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన 'యుద్ధ అభ్యాస్-2026' 22వ ఎడిషన్ ఉమ్మడి సైనిక విన్యాసాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్తరాఖండ్‌లోని ఔలీలోని ఫారిన్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన ప్రారంభోత్సవ వేడుకలతో పాటు సైనిక విన్యాసాలను నిర్వహించారు. ఆ డ్రిల్‌లో ఇరుదేశాలకు నుంచి సుమారు 600 మంది సైనిక సిబ్బంది పాల్గొన్నారు. ఉత్తరాఖండ్‌తో పాటు రాజస్థాన్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఆ విన్యాసాలు ఏకకాలంలో జరుగుతున్నాయి. ఔలీలో జరిగిన ప్రారంభోత్సవంలో భారత సైన్యానికి చెందిన 14వ పదాతిదళ విభాగం జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ అమరేశ్ గుంజన్, అమెరికా సైన్యానికి చెందిన 11వ ఎయిర్‌బోర్న్ డివిజన్‌లోని 1వ పదాతిదళ బ్రిగేడ్ కంబాట్ టీమ్ కమాండర్ కల్నల్ బెన్ జాక్‌మన్ పాల్గొన్నారు. ఆ విన్యాసాలు ఇరుపక్షాలకు కార్యాచరణ పద్ధతులను అంచనా వేసుకోవడానికి, అభివృద్ధి చేసుకోవడానికి అవకాశాన్ని కల్పిస్తాయని భారత సైనిక అధికారి జనరల్ అమరేశ్ గుంజన్ పేర్కొన్నారు. ఇరుదేశాల సైన్యాల మధ్య బంధాన్ని బలపరుస్తుందని, ఎలాంటి పరిస్థితులలోనైనా కలిసి విజయం సాధించడానికి సిద్ధం చేస్తుందన్నారు. మరోవైపు, అమెరికా సైనిక అధికారి బెన్ జాక్‌మన్ కూడా మట్లాడారు. ఆ డ్రిల్స్? ఇరుదేశ సైనిక దళాల మధ్య మరింత నమ్మకాన్ని పెంపొందించుకోవడానికి సహాయపడుతుందని అభిప్రాయపడ్డారు. పర్వత ప్రాంతాల్లో ఉమ్మడి కార్యకలాపాలు నిర్వహించే సామర్థ్యాన్ని బలోపేతం చేయడమే విన్యాసాల ప్రాథమిక లక్ష్యమని చెప్పారు. అత్యంత కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లోనూ ఉమ్మడి ప్రణాళికలు రచించడం, కార్యాచరణ అమలు, యుద్ధ నైపుణ్యాలు వంటి వాటిపై రెండు దేశాల సైన్యాలు ప్రధానంగా దృష్టి సారిస్తాయని అన్నారు.

**ఆధునిక సాంకేతికతపై ప్రత్యేకంగా ఫోకస్**

యుద్ధ అభ్యాస్? 2026 విన్యాసాల్లో ఈసారి ఆధునిక సాంకేతికతపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. నిఘా, శత్రువుల కదలికలను కనిపెట్టే ఆపరేషన్ల కోసం దృష్టి కేంద్రీకరిస్తున్నారు. రాజస్థాన్‌లోని మహాజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఆధునిక ఆయుధ వ్యవస్థల ప్రదర్శన జరగనుంది. ఆ కార్యక్రమంలో అభివృద్ధి చెందుతున్న సైనిక అవసరాలు, మిలిటరీ టెక్నాలజీకి సంబంధించి ఇరుదేశాల సైనిక నిపుణులు తమ అనుభవాలను పంచుకుంటారు. అదేవిధంగా, ఔలిలో పర్వత ప్రాంత యుద్ధ శిక్షణ, అలాగే మహాజన్‌లో ఫీల్డ్ ఫైరింగ్ విన్యాసాల ద్వారా రెండు దేశాల సైన్యాలు తమ సన్నద్ధతను పరీక్షించుకుంటున్నాయి. వీటి ద్వారా ప్రతికూల పరిస్థితులలో తమ సామర్థ్యాన్ని అంచనా వేసుకుంటాయి.

**'ఇరుదేశాల సైనికులు కలిసి శిక్షణ పొందుతారు'**

మరోవైపు, భారత్?- అమెరికా సంయుక్తంగా నిర్వహిస్తున్న సైనిక విన్యాసాలపై భారత్?లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఎక్స్ వేదికగా స్పందించారు. "రానున్న రెండు వారాల్లో, అమెరికా, భారత సైనికులు కలిసి శిక్షణ పొందుతారు. ఈ క్రమంలో ఇరుదేశాల సైనికులు తమ నైపుణ్యాలను పంచుకుంటూ, సంసిద్ధతను పెంచుకుంటారు. అలాగే, ఇరుదేశాల సైనికుల మధ్య సహకారాన్ని మెరుగుపరుచుకుంటారు" అని? పోస్టులో రాసుకొచ్చారు.

**పర్వతా శిక్షణ కోసం అమెరికా సైనికులకు సువర్ణావకాశం**

ఇదిలా ఉండగా, ఔలీ ప్రాంతం సముద్ర మట్టానికి అత్యంత ఎత్తులో ఉంటుంది. అంతేకాదు, సవాలుతో కూడిన భౌగోళిక పరిస్థితులను కలిగి ఉంటుంది. ఈ భూభాగం పర్వతా శిక్షణ కోసం అమెరికా సైనికులకు ఒక మంచి అవకాశాన్ని అందిస్తాయి. అదే సమయంలో భారత సైనికులకు కూడా అమెరికా సైన్యం అవలంభిస్తున్న ఆధునిక పోరాట పద్ధతులు, ఆపరేషన్? పద్ధతులను నేర్చుకునే అవకాశం కలుగుతుంది.

కాగా, యుద్ధ అభ్యాస్ 2026 సైనిక డ్రిల్స్ సెప్టెంబర్ 15న ప్రారంభమయ్యాయి. ఈసారి రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఒకేసారి జరుగుతున్నాయి. ఆ విన్యాసాలు రెండు వారాల పాటు జరిగి సెప్టెంబర్? 28న ముగియనున్నాయి. భారత్, అమెరికా మధ్య ఏటా ఈ విన్యాసాలు జరుగుతుంటాయి. ఇరుదేశాల మధ్య రక్షణ బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవడంలో డ్రిల్స్? కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, ఈసారి భౌగోళిక వాతావరణంలో నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో లేదా ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో ఇరు దేశాల సైన్యాలు కలిసికట్టుగా, సమర్థవంతంగా పనిచేసే సామర్థ్యాన్ని పెంచుకునేందుకు విన్యాసాలు దోహదపడనున్నాయి.

# రూ.2,000 వరకు యూపీఐ చెల్లింపులపై బ్యాంక్ ఛార్జీలు ఉండవు




**న్యూఢిల్లీ :** యూపీఐ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టత ఇచ్చింది. రూ.2,000 వరకు జరిగే యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ లావాదేవీలపై బ్యాంకులు ఎలాంటి ఛార్జీలు విధించకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే రూ.2,000 వరకు ఖీబీఖజీఎ డెబిట్ కార్డుల ద్వారా జరిగే చెల్లింపులపైనా బ్యాంకులు ఛార్జీలు వసూలు చేయడానికి వీలు లేదని పేర్కొంది.కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ఖజీఎఎవనిబి జీనిట నావబిబిశ్రీవఎవనిబి నాఎబబివఎబ ంఇఃబి కింద నిబంధనల్లో మార్పులు చేస్తూ ఈ నోటిఫికేషన్‌ను జారీ చేశారు.రూ.2,000 వరకు యూపీఐ రూపీ డెబిట్ కార్డు ద్వారా చెల్లింపులు చేసే వ్యక్తుల నుంచి బ్యాంకులు, సిస్టమ్ ప్రొవైడర్లు ఎలాంటి ప్రత్యక్ష లేదా పరోక్ష ఛార్జీలు వసూలు చేయకూడదని ప్రభుత్వం తెలిపింది. చెల్లింపు చేసే వ్యక్తితో పాటు చెల్లింపు స్వీకరించే వ్యక్తిపై కూడా ఇలాంటి ఛార్జీలు విధించకూడదని స్పష్టం చేసింది.ఈ లావాదేవీలను ప్రభుత్వం అధికారికంగా "ఎలక్ట్రానిక్ మోడ్ ఆఫ్ పేమెంట్"గా వర్గీకరించింది. చెల్లింపులపై ఛార్జీలు విధించే అవకాశం ఉందంటూ చర్చ జరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ స్పష్టత ఇచ్చింది. వినియోగదారులు యూపీఐ ద్వారా చెల్లింపులు చేసేందుకు ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని గత నెలలోనే ప్రభుత్వం వెల్లడించింది.

ముఖ్యంగా లావాదేవీలు పూర్తిగా ఉచితంగానే కొనసాగుతాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. వ్యాపారులపై కూడా అన్ని యూపీఐ లావాదేవీలకు వర్తించే విధంగా ఎలాంటి విధించబోమని స్పష్టం చేసింది.భవిష్యత్తులో నిర్దిష్ట పరిమితికి మించిన కొన్ని యూపీఐవ్యాపార లావాదేవీలపై మాత్రమే ఎండీఆర్ విధించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. అయితే ఈ ఛార్జీలు డెబిట్ లేదా క్రెడిట్ కార్డు లావాదేవీలపై ప్రస్తుతం వర్తించే పోలిస్తే గణనీయంగా తక్కువగా ఉంటాయని పేర్కొంది.దేశవ్యాప్తంగా రోజువారీ చెల్లింపులకు వినియోగం భారీగా పెరిగిన నేపథ్యంలో కేంద్రం తాజా స్పష్టత వినియోగదారులకు ఊరటనిచ్చే అంశంగా మారింది. ముఖ్యంగా చిన్న మొత్తాల చెల్లింపుల్లో అదనపు ఛార్జీల భారం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేయడంతోయూపీఐ వినియోగం మరింత సులభంగా కొనసాగనుంది.

## మక్కాపై డ్రోన్ దాడి యత్నం.. స్పందించిన భారత్




సౌదీ అరేబియాలోని మక్కా సమీపంలో చోటుచేసుకున్న డ్రోన్ దాడి యత్నాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. సౌదీ అరేబియా రక్షణ దళాలు ఈ దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టడం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూనే, ఆ ప్రాంతంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఇటువంటి చర్యలు ఆందోళనకరమని భారత విదేశాంగ శాఖ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ, "ప్రపంచవ్యాప్తంగా ముస్లింలకు మక్కా అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రం. అలాంటి పవిత్ర ప్రదేశాన్ని లక్ష్యంగా చేసుకుని దాడికి యత్నించడం అత్యంత ఆందోళనకరమైన విషయం" అని వ్యాఖ్యానించారు. సౌదీ అరేబియా సార్వభౌమాధికా రానికి భంగం కలిగించేలా, పౌరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా సాగుతున్న ఈ దాడులను భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆయన స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం త్వరితగతిన నెలకొనాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. సెప్టెంబర్ 15వ తేదీ సాయంత్రం హౌతీ తిరుగుబాటుదారులు ప్రయోగించిన డ్రోన్‌ను సౌదీ వైమానిక దళాలు ప్రాథమిక దశలోనే గుర్తించాయి. మక్కా నగరంలోని నిషిద్ధ గగనతలంలోకి అది ప్రవేశించకముందే గాలిలోనే అడ్డగించి ధ్వంసం చేశాయి. ఈ హేయమైన చర్యను సౌదీ సంకీర్ణ దళాల ప్రతినిధి మేజర్ జనరల్ తుర్కి అల్ మల్కి తీవ్రంగా పరిగణిస్తూ, ఇదొక ప్రణాళికాబద్ధమైన ఉగ్రవాద చర్యగా అభివర్ణించారు. ఉమ్రా యాత్రికులను భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు ముస్లింల మతపరమైన మనోభావాలను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ దాడికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. రెండు పవిత్ర మసీదుల భద్రత తమకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, దీనికి విఘాతం కలిగించే హౌతీలపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. 2017లో బాలిస్టిక్ క్షిపణితో దాడి చేసిన తర్వాత, మక్కాను లక్ష్యంగా చేసుకోవడం ఇది రెండోసారి అని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## లింగ సమానత్వ సూచీలో 131వ స్థానంలో భారత్

స్త్రీ, పురుష సమానత్వం విషయంలో భారత్ 131వ స్థానంలో నిలిచింది. గతేడాది ఉన్న ర్యాంకునే మళ్లీ ఇండియా నిలుపుకుంది. లింగ సమానత్వంలో వరుసగా 16వ సారి తొలి స్థానంలో ఐస్‌లాండ్ నిలిచింది. ఫిన్‌లాండ్, నార్వే, నమీబియా, యూకే వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదో స్థానాల్లో నిలిచాయి. ప్రపంచంలోని 148 దేశాల్లో లింగ సమానత్వ స్థితిగతుల సమాచారంతో 'గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్- 2026'ను వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) బుధవారం రిలీజ్ చేసింది. 145 దేశాలున్న ఈ సూచికలో భారత్ కంటే దిగువన కేవలం పపువా న్యూ గినియా, కువైట్, ఒమన్, ఖతార్, తజికిస్థాన్, సౌదీ అరేబియా, ఈజిప్ట్, మొరాకో, మాలి, అల్జీరియా, కాంగో వంటి 14 దేశాలు ఉన్నాయి. డబ్ల్యూఈఎఫ్ విడుదల చేసిన సూచికలో చాద్ అత్యల్ప ర్యాంకు (145) పొందిన దేశంగా నిలిచింది. ఇరాన్(144), పాకిస్థాన్ (143) ర్యాంకులతో అట్టడుగు జాబితాలో నిలిచాయి.

డబ్ల్యూఈఎఫ్ సూచిక ప్రకారం, 2006లో తొలిసారి తాము తొలిసారి విడుదల చేసిన గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్‌ను, తాజా సూచికతో పోల్చింది వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్. ప్రపంచంలోనే అత్యధిక జనాభా (సుమారు 150 కోట్లు) ఉన్న భారత్‌లో 'ప్యారిటీ స్కోర్' 64.5 శాతంగా ఉంది. ఇది ప్రపంచ సగటు కంటే తక్కువ. గతేడాదితో పోలిస్తే భారత్ 'ప్యారిటీ స్కోర్' కొద్దిగా మెరుగుపడింది. మొత్తంగా 2006 నుంచి ఇప్పటి వరకు భారత్‌లో లింగ సమానత్వం 4.3 శాతం పాయింట్లు పెరిగింది. దీనికి ప్రధాన కారణం విద్యా రంగంలో సాధించిన పురోగతి అని వరల్డ్ ఎకనామిక్ ఫోరం అంచనా వేసింది.

ఆర్థిక భాగస్వామ్యం, ఉపాధి అవకాశాల్లో భారత్ 41.2 శాతం ప్యారిటీ స్కోర్‌ను నమోదు చేసింది. వృత్తి, సాంకేతిక రంగ కార్మికులు సాధించిన బలమైన పురోగతి కారణంగా ఆయా రంగాల్లో దేశంలో ప్యారిటీ స్కోర్ 2006లో 26.6 శాతం ఉండగా, 2026 నాటికి అది 49.9 శాతానికి చేరింది. రాజకీయ సాధికారత విభాగంలో దేశ ప్యారిటీ స్కోర్ మునుపటి ఏడాది కంటే 0.7 పాయింట్లు మేర తగ్గింది. భారత ప్రభుత్వంలోని మంత్రి పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం 2006లో 2.4 శాతం ఉండగా, అది 2026 నాటికి 5.9 శాతానికి పెరిగింది. 2019లో ఈ విభాగంలో భారత్ అత్యధికంగా 30 శాతం ప్యారిటీ స్కోర్‌ను నమోదు చేసింది. ఆరోగ్య- జీవన స్థితిగతుల విభాగంలోనూ ఈ ఏడాది భారత్ మెరుగైన ప్యారిటీ స్కోర్‌ను సాధించింది.

'పూర్తి సమానత్వం సాధించడానికి ఇంకా 120 ఏళ్లు పడుతుంది'

2006 నుంచి తాము పర్యవేక్షిస్తున్న దాదాపు ప్రతి ఆర్థిక వ్యవస్థ లింగ సమానత్వంలో పురోగతి సాధించిందని జెనీవాకు చెందిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ తెలిపింది. అయితే పూర్తి లింగ సమానత్వం సాధించడానికి ఇంకా 120 ఏళ్లు పడుతుందని అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా లింగ అంతరం ఇప్పుడు 69.2 శాతానికి తగ్గిందని, ఇది గతేడాదితో పోలిస్తే 0.4 శాతం పాయింట్లు ఎక్కువని అభిప్రాయపడింది. ఏదైనా కంపెనీ లేదా సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) పదవులలో మహిళలు 19.1 శాతం మాత్రమే ఉన్నారని చెప్పింది. మహిళలు నిర్వహిస్తున్న ప్రతి 10 మంత్రిత్వ శాఖలలో కేవలం ఒకటి మాత్రమే సరైనదని పేర్కొంది.

**ఏఐ రంగంలో కూడా మహిళలు తక్కువే!**

అలాగే కృత్రిమ మేధ (ఏఐ) ఇంజినీర్లలో ప్రతి ఐదుగురిలో ఒకరి కంటే తక్కువ మంది మహిళలు ఉన్నారని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ మేనేజింగ్ డైరెక్టర్ సాదియా జాహిది తెలిపారు. ఏఐ సంస్థలలో ప్రతి స్థాయిలో మహిళ ప్రాతినిధ్యం తక్కువగా ఉందని పేర్కొన్నారు. ఇరవై సంవత్సరాల డేటా ప్రకారం అన్ని దేశాలు లింగ సమానత్వం సాధించవచ్చని తెలుస్తోందన్నారు. సమానత్వం అనేది వృద్ధికి, పోటీతత్వానికి పునాది అని అభిప్రాయపడ్డారు.

## కన్నడ లెజెండ్ అనంత్ నాగ్‌కు 'దాదాసాహెబ్ ఫాల్కే' పురస్కారం

సీనియర్ నటుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి అనంత్ నాగ్‌కు భారతీయ చలనచిత్ర రంగంలో అత్యున్నత పురస్కారమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024 సంవత్సరానికిగాను.. భారతీయ సినిమాకు ఆయన అందించిన విశేష సేవలను గుర్తిస్తూ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక చేసినట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) అధికారికంగా వెల్లడించింది. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు ఎంపిక కమిటీ సిఫార్సు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 22న గుజరాత్‌లోని కెవాడియాలో జరగనున్న 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రదానోత్సవంలో అనంత్ నాగ్ ఈ అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా అనంత్ నాగ్‌కు అభినందనలు తెలిపారు. అద్భుతమైన నటన, వైవిధ్యమైన పాత్రలతో, ముఖ్యంగా కన్నడ చిత్రసీమలో ఆయన చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఈ గౌరవానికి ఆయన అన్ని విధాలా అర్హులని ప్రధాని పేర్కొన్నారు. 1948 సెప్టెంబర్ 4న జన్మించిన అనంత్ నాగ్ (అనంత్ నాగర్‌కట్టె) తన సుదీర్ఘ కెరీర్‌లో 300కు పైగా చిత్రాల్లో నటించారు. వీటిలో 250కి పైగా కన్నడ చిత్రాలే ఉన్నాయి. ఆయన కన్నడతో పాటు హిందీ, తెలుగు, తమిళం, మరాఠీ, మలయాళం, ఇంగ్లీష్ భాషల్లోనూ తన నటనతో ప్రేక్షకులను మెప్పించారు. వెండితెరపైనే కాకుండా, ఆర్.కె. నారాయణ్ కథల ఆధారంగా దూరదర్శన్‌లో ప్రసారమైన 'మాల్గుడి డేస్' సీరియల్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. తన నటనకుగాను ఐదుసార్లు కర్ణాటక రాష్ట్ర చలనచిత్ర పురస్కారాలు అందుకున్న అనంత్ నాగ్‌ను, గత ఏడాది (2025) భారత ప్రభుత్వం దేశంలోని మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్‌తో సత్కరించింది. దశాబ్దాలుగా భారతీయ సినిమాకు ఆయన చేస్తున్న సేవలకు ఫాల్కే అవార్డు సరైన గౌరవమని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

# గత ప్రభుత్వంలో పెట్టిన దొంగ కేసులన్నీ ఎత్తివేస్తాం

-మొదటిపేజీ తరువాయి

వస్తే మాత్రం దబిడి దిబిడేనని ప్రత్యర్థి పార్టీ నేతలను గట్టిగా హెచ్చరించారు. బుధవారం నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గంలో పర్యటించిన లోకేశ్, 'కార్యకర్తే అధినేత' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన గత ప్రభుత్వంపై, వైసీపీ అధినేత నేత జగన్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఒకడు బుల్లెట్ దిగిందా అంటాడు. గెలవకపోతే రాజకీయ సన్యాసం చేస్తానన్నాడు, ఏమైంది ఆ సన్యాసం? చంద్రబాబు జోలికి ఎవరు వచ్చినా మాడి మసైపోతారు. దేవుడు ఎవర్నీ వదిలిపెట్టడు," అంటూ పరోక్షంగా స్థానిక నేతలపై విమర్శలు గుప్పించారు.

### జగన్‌కు డీఎస్సీపై చర్చకు సవాల్

గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం డ్రామా కంపెనీ నడిపిందని లోకేశ్ ధ్వజమెత్తారు. "కోడికత్తి, గులకరాయి వంటి డ్రామాలను ప్రజలెవరూ మర్చిపోలేదు. ఒక ముఖ్యమంత్రికి డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియకపోవడం ఆశ్చర్యం కలిగించింది. బహుశా వాళ్ల దృష్టిలో డీఎస్సీ అంటే డ్రగ్స్, శాండ్, చీప్ లిక్కర్ కావచ్చు. ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్ట్ కూడా భర్తీ చేయని వాళ్లు, మేము అధికారంలోకి రాగానే 16,000 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహిస్తే విమర్శిస్తున్నారు. దమ్ముంటే డీఎస్సీపై చర్చకు రా.. టైమ్, డేట్, లొకేషన్ నువ్వే ఫిక్స్ చెయ్," అంటూ జగన్‌కు సవాల్ విసిరారు. సొంత బాబాయి హత్య కేసులో ఇప్పుడు ఈడీ విచారణ ఎదుర్కొంటున్నారని, నాడు 'నారాసుర రక్త చరిత్ర' అంటూ తమపై బురద చల్లారని మండిపడ్డారు.

### మాజీ మంత్రుల అవినీతిని ఎండగట్టిన లోకేశ్

గత ప్రభుత్వంలోని మంత్రులు అవినీతిలో కూరుకుపోయారని లోకేశ్ ఆరోపించారు. మాజీ మంత్రి శిదిరి అప్పలరాజు కొడుకు యాక్సిడెంట్ చేసి ఒక యాదవుడిని చంపి పారిపోతే, ఆ కేసులో మరొకరిని ఇరికించాలని చూశారని విమర్శించారు. అలాంటి వ్యక్తిని జగన్ పరామర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. మరో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మద్యం కుంభకోణంలో రూ.400 కోట్లు



సంపాదించి, ఆ డబ్బును కోడలి ఖాతాలో వేశారని, ఇప్పుడు ఆమెను కేసులో ఇరికించారని ఆరోపించారు. బీసీ నేతలైన అమర్‌నాథ్ గౌడ్, నందం సుబ్బయ్యలను వైసీపీ నేతలే పొట్టనపెట్టుకున్నారని, ఇప్పుడు కులం ముసుగులో రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

### దొంగ కేసులన్నీ ఎత్తివేస్తాం: కార్యకర్తలకు భరోసా

2019 నుంచి 2024 మధ్య టీడీపీ కార్యకర్తలపై గత ప్రభుత్వం బనాయించిన దొంగ కేసులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన ఎత్తివేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. ఇందుకోసం ఎంపీ బైరెడ్డి శబరి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. కేసులు ఉన్న కార్యకర్తలు వెంటనే పార్టీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. మీరు ఇంట్లో పడుకుంటే, మీ కేసుల సంగతి మాకు ఎలా తెలుస్తుంది? మీపై ఉన్న కేసుల వివరాలను పార్టీ కేంద్ర కార్యాలయానికి తెలియజేయాలి అని స్పష్టం చేశారు.

అదేవిధంగా, 2014-19 మధ్య టీడీపీ హయాంలో చేసిన పనులకు సంబంధించి ఆగిపోయిన బిల్లులను కూడా 99 శాతం క్లియర్ చేశామని, మిగిలినవి ఉంటే తెలియజేయాలని కోరారు. ఎన్నికల సమయంలో కాకుండా ఇప్పుడే ఈ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. కోవూరులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఆనందంగా ఉందని లోకేశ్ అన్నారు. నియోజకవర్గంలో ఎనిమిది సార్లు గెలిచినా అన్నగారి విగ్రహం లేని లోటును వేమిరెడ్డి దంపతులు తీర్చారని అభినందించారు. కార్యకర్తే పార్టీకి అధినేత అని, వారి త్యాగాల వల్లే పార్టీ నిలబడి ఉందని కొనియాడారు. 'మై టీడీపీ' యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి, పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు లైఫ్ వచ్చేనా

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో మరోసారి అధిష్ఠానం ఇన్‌ఛార్జ్ ల మార్పు ప్రక్రియను పూర్తి చేసింది. శరవేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాల నడుమ, మాణిక్యం ఠాగూర్ స్థానంలో కర్ణాటకకు చెందిన సీనియర్ నేత పీసీ మోహన్‌ను ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా ఏఐసీసీ నియమించింది. అయితే, 2014 రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ ఘోరంగా పడిపోయిన విషయాన్ని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పునాదులు కదిలిపోయిన చోట కేవలం పర్యవేక్షకులను, ఇన్‌ఛార్జ్‌లను మార్చడం వల్ల పార్టీకి కొత్త ఊపిరి వస్తుందా అంటే.. ప్రయోజనం శూన్యమనే సమాధానమే వస్తోంది. ఏపీ విభజనకు ముందు కాంగ్రెస్ పార్టీకి అత్యంత బలమైన కోర్ ఓట్ బ్యాంక్ ఉండేది. ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజిక వర్గాలు , దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి అభిమానులు కాంగ్రెస్‌కు వెన్నెముకగా నిలిచారు. కానీ, విభజన పర్యవసానాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోగా.. ఆ సాంప్రదాయ ఓటు బ్యాంక్ మొత్తాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన ఖాతాలోకి మళ్లించుకుంది. గత పదేళ్లుగా వైఎస్సార్‌సీపీకి అదే ప్రధానమైన బలంగా మారింది. కాంగ్రెస్ పునర్వైభవం సాధించాలంటే ఆ కోల్పోయిన పునాదిని మళ్లీ దక్కించుకోవడం ఒక్కటే మార్గం, కానీ ఆ దిశగా పార్టీ కేంద్ర నాయకత్వం సీరియస్ ప్రయత్నాలు చేయడంలో పూర్తిగా విఫలమవుతోందనే విమర్శలు ఉన్నాయి.రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి స్పష్టమైన క్షేత్రస్థాయి వ్యూహం లేకపోవడమే అతిపెద్ద బలహీనత. కేవలం ఎన్నికలు వచ్చినప్పుడు లేదా అసెంబ్లీ వేళల్లో ప్రెస్ మీట్లు పెట్టడం, సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేయడానికే రాష్ట్ర నాయకత్వం పరిమితమవుతోంది. వైఎస్ షర్మిలకు ఏపీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన తర్వాత కొంతవరకు మీడియా మైలేజ్, క్యాడర్‌లో కొంత చలనం వచ్చినా.. అది ఓట్ల రూపంలోకి లేదా వైఎస్సార్‌సీపీ కోర్ ఓటు బ్యాంకును ఆకర్షించే స్థాయిలోకి మారలేదు. అసలైన జనాకర్షక నేతలు, క్షేత్రస్థాయిలో బలం ఉన్న స్థానిక నాయకత్వం లేకపోవడం వల్ల పార్టీ విస్తరణ ఆగిపోయింది.



దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు, రాష్ట్ర స్థాయిలో వైఎస్సార్‌సీపీకి ఉన్న ఓటు బ్యాంకు స్వరూపం ఒకటే. కానీ ఏపీలో వైఎస్ఆర్‌సీపీని విమర్శించే క్రమంలో కాంగ్రెస్ పార్టీ టీడీపీ-బీజేపీ-జనసేన కూటమికి అనుకూలంగా ఉందనే భావన సాధారణ ప్రజల్లోకి వెళ్తోంది. ప్రత్యేకించి బీజేపీతో టీడీపీ పొత్తులో ఉన్న తరుణంలో, బీజేపీ వ్యతిరేక ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్‌కు మంచి అవకాశం ఉన్నప్పటికీ, కూటమి వైఫల్యాలపై ధ్వజమెత్తడంలో కాంగ్రెస్ వైఖరి స్పష్టంగా ఉండటం లేదనే విమర్శ ఉంది. ఈ వ్యూహాత్మక అయోమయం వల్ల మైనారిటీ, దళిత వర్గాలు కాంగ్రెస్ వైపు చూడటానికి వెనుకాడుతున్నాయి.కర్ణాటకకు చెందిన పీసీ మోహన్ నాయకత్వంలోనైనా ఏపీ కాంగ్రెస్ రూట్ మ్యాప్ మారుతుందా అన్నది ఇప్పుడు సవాలు. కర్ణాటకలో కాంగ్రెస్ సాధించిన విజయం, అక్కడ అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాల మోడల్‌ను ఏపీ ప్రజల్లోకి తీసుకెళ్లడం మోహన్‌కు కొంతవరకు కలిసివచ్చే అంశం. అయితే, కేవలం విజయవాడ లేదా అమరావతిలోని పార్టీ కార్యాలయాల్లో సమీక్షలు నిర్వహించడానికే ప్రాధాన్యత ఇస్తే ఎలాంటి ఫలితం ఉండదు. బూత్ స్థాయి నుంచి కమిటీలను పునర్నిర్మించడం, కూటమి ప్రభుత్వం , ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ రెండింటికీ సమదూరం పాటిస్తూ సొంత అజెండాతో ప్రజల్లోకి వెళ్లడం తక్షణ అవసరం. రూట్ లెవల్‌లో నాయకత్వాన్ని తయారు చేయకుండా, డివైడ్ అయిన సాంప్రదాయ ఓటు బ్యాంకును ఆకట్టుకునేలా స్పష్టమైన ఆర్థిక-సామాజిక విధాన ప్రకటనలు చేయకుండా.. ఇన్‌ఛార్జ్‌లను ఎంతమందిని మార్చినా ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మిగిలిపోతుంది. కొత్తగా వచ్చిన పీసీ మోహన్ అయినా కేవలం ఢిల్లీ మార్గదర్శకాలను అమలు చేసే ప్రతినిధిగా మిగలకుండా, ఏపీ కాంగ్రెస్‌కు కొత్త శ్వాస ఊదేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

# అనిల్‌కు దౌరమౌతున్న నెల్లూరు

**నెల్లూరు :** నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ అడుగులు మళ్లీ చర్చనీయాంశంగా మారాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను వేదికగా చేసుకుని, నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ పదవిని దక్కించుకోవడమే లక్ష్యంగా అనిల్ ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టిని ఆకర్షించేందుకు, అధికార కూటమి నేతలతో పాటు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులను టార్గెట్ చేస్తూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే, అనిల్ పడుతున్న ఈ ఆరాటం క్షేత్రస్థాయిలో ఆయనకు రాజకీయ లబ్ధిని చేకూరుస్తుందా అంటే.. సాధ్యం కాదనే సమాధానమే సొంత పార్టీ వర్గాల నుంచే వస్తోంది.జగన్ మోహన్ రెడ్డి నైజం తెలిసిన ఎవరికైనా అనిల్ ఆశలు నెరవేరడం అంత సులువు కాదని అర్థమైపోతుంది. ప్రస్తుతం నెల్లూరు సిటీ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్‌గా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. జగన్‌కు అత్యంత విశ్వసనీయుడిగా, ఆర్థికంగా , సామాజికంగా బలంగా ఉన్న చంద్రశేఖర్ రెడ్డిని పక్కనపెట్టి, గత ఎన్నికల్లో నరసరావుపేటకు వెళ్లి ఓటమిపాలై మళ్లీ నెల్లూరుకు వచ్చిన అనిల్ చేతికి సిటీ బాధ్యతలు అప్పగించే సాహసం జగన్ చేయకపోవచ్చని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. వైసీపీ అధిష్టానం ఆలోచన శైలి ప్రకారం.. ఒకసారి నియోజకవర్గం మారిన తర్వాత లేదా ఓటమిపాలయ్యాక మళ్లీ పాత స్థానానికి పూర్తి స్థాయిలో రీ-ఎంట్రీ ఇవ్వడం దాదాపు అసాధ్యం.మరోవైపు నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీలోని ప్రధాన రెడ్డి సామాజికవర్గ నేతలెవరూ అనిల్ కుమార్ యాదవ్‌ను మళ్లీ జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పనిచ్చేందుకు సిద్ధంగా లేరు. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో ఆయన ప్రదర్శించిన ఏకపక్ష వైఖరి, సొంత పార్టీ నేతలతోనే విభేదించిన తీరు ఇంకా వారి మనసుల్లో మెదులుతూనే ఉంది. బిసి కార్డును వాడుకుని మళ్లీ తమ సామాజికవర్గానికి దక్కాల్సిన రాజకీయ అవకాశాలు, పట్టును అనిల్ కొట్టేస్తారనే భయం వారిలో బలంగా ఉంది. అందుకే జిల్లాలోని రెడ్డి సామాజికవర్గ సీనియర్లు అంతా అంతర్గతంగా అనిల్‌కు వ్యతిరేకంగా ఏకమవుతూ, ఆయనకు సిటీ బాధ్యతలు రాకుండా అధిష్టానం వద్ద గట్టిగానే అడ్డుకట్ట వేస్తున్నట్లు సమాచారం.స్థానిక ఎన్నికల హడావుడిని అడ్డం పెట్టుకుని, వేమిరెడ్డి దంపతులపై అనవసరమైన ఆరోపణలు, హడావుడి వ్యాఖ్యలు చేయడం ద్వారా తానే జిల్లాలో వైసీపీ తరఫున ఏకైక పోరాట యోధుడినని ప్రొజెక్ట్ చేసుకోవడానికి అనిల్ ప్రయత్నిస్తున్నారు. అయితే, గతంలో వైసీపీలోనే ఉండి పార్టీకి కొండంత అండగా నిలిచిన వేమిరెడ్డిని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడం వల్ల అనిల్‌కు పార్టీ శ్రేణుల నుంచి కూడా పెద్దగా మద్దతు లభించడం లేదు. పైగా ఈ రకమైన అతి దూకుడు వల్ల స్థానికంగా ప్రశాంతంగా ఉన్న కేడర్‌లో కూడా అనవసర ఉద్రిక్తతలు పెరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.అనిల్ కుమార్ యాదవ్ ఎంతగా హడావుడి చేసినా, జగన్‌ను మెప్పించేందుకు ఎంతటి తీవ్ర వ్యాఖ్యలు చేసినా, రాబోయే రోజుల్లో ఆయనకు నెల్లూరు సిటీ టికెట్ లేదా ఇన్ ఛార్జ్ పదవి దక్కే అవకాశాలు దాదాపు శూన్యమనే ప్రచారం నెల్లూరు రాజకీయాల్లో గట్టిగా సాగుతోంది. స్వపక్షంలోనే సీనియర్ల నుంచి ఎదురవుతున్న తీవ్ర వ్యతిరేకత, అధిష్టానంలో చంద్రశేఖర్ రెడ్డికి ఉన్న ప్రాధాన్యత, జగన్ రాజకీయ వ్యూహాల దృష్ట్యా అనిల్ నెల్లూరు రీ-ఎంట్రీ ఒక కలగానే మిగిలిపోయే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## ఏపీలో 5 వేల శ్రీవారి ఆలయాలు నిర్మిస్తాం

-మొదటిపేజీ తరువాయి

శాతం గ్రీన్ కవర్ ఉందని, దీన్ని మరింత పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శ్రీవారికి నిర్వహించే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలు, తిరుమలలోని వివిధ ప్రాంతాలను త్రీడీ సాంకేతికత ద్వారా భక్తులు వీక్షించే అవకాశం కల్పించారు. 6 డీవీఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా తిరుమల దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. గతంలో ఉన్న ఎస్వీ మ్యూజియాన్ని ఆధునీకరించి పునః ప్రారంభించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీవారి పరిణయం తదితర అంశాలను భక్తులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రదర్శించేలా టీటీడీ ఈ మ్యూజియాన్ని సిద్ధం చేసింది. తిరుమలలో భక్తుల రాకపోకలకు వీలుగా రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. రిలయన్స్ ఈ--మొబిలిటీ సీఈఓ నితిన్ సేత్, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా ఎల్లా, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సహా టీటీడీ సభ్యులతో కలిసి నారాయణ గిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకూ ఎలక్ట్రిక్ బస్సులో సీఎం ప్రయాణించారు. తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికీ బీమా సదుపాయం కల్పించాలని టీటీడీ నిర్ణయించిందని సీఎం తెలిపారు. ఎల్ఐసీతో కలిసి ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ బీమా అమలు చేయనున్నట్లు చెప్పారు. దురదృష్టవశాత్తూ తిరుమలలో భక్తుడు మరణిస్తే రూ.2 లక్షల ఆర్థిక సాయం అందేలా ఈ బీమా వర్తిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 5 వేల దేవాలయాలను శ్రీవాణి ట్రస్టు ద్వారా నిర్మాణం చేపడతామన్నారు. మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాల్లో కూడా శ్రీవారి ఆలయాలు నిర్మించాలని కోరుతున్నారని, దీనిపై ఆలోచన చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుతో పాటు టీటీడీ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## లక్ష్యాలు చేరకపోతే ఈ సమావేశాలెందుకు?

-మొదటిపేజీ తరువాయి

దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని చంద్రబాబు ప్రశంసించారు. "రుణాలు తీసుకున్న వారిలో 99 శాతానికి పైగా మహిళలు సకాలంలో తిరిగి చెల్లిస్తున్నారు. ఈ విషయంలో ఏపీ ఎస్‌హెచ్‌జీ మహిళలు దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలిచారు. కేవలం 0.67 శాతం మంది మాత్రమే చెల్లింపుల్లో విఫలమవుతున్నారు. వీరి నుంచి బకాయిలు వసూలు చేసేందుకు 'వన్ టైమ్ సెటిల్‌మెంట్' (ఓటీఎస్) విధానంపై ఆలోచించాలని బ్యాంకులకు సూచిస్తున్నాను" అని వివరించారు. రాష్ట్రంలో 15 శాతం ఆర్థిక వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అయితే ఎల్‌నినో కారణంగా కొంత ఇబ్బందికర పరిస్థితి తలెత్తిందని చంద్రబాబు తెలిపారు. ఈ ప్రతికూలతలను అధిగమించి ముందుకు సాగుతామని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా, రాష్ట్ర వ్యవసాయ రంగంలో కీలకమైన కౌలు రైతులకు రుణాలు సమృద్ధిగా అందించేందుకు బ్యాంకులు చొరవ చూపాలని ఆయన కోరారు.

## ఏపీ పోలీసులు ఎఫ్‌బీఐగా నటిస్తున్నారు..

-మొదటిపేజీ తరువాయి

అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. "చంద్రబాబు గారూ, ఇది పోలీసింగా? లేక రాజకీయ వేధింపుల కోసం చేస్తున్న ప్రభుత్వ ప్రాయోజిత మోసమా? ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న పోస్టులను తొలగించేందుకు ఏపీ పోలీసులే తమ అధికారిక ఈమెయిల్ నుంచి 'ఎక్స్'కు అభ్యర్థన పంపారని, కానీ అభ్యర్థన పంపిన సంస్థ పేరుగా 'ఎఫ్‌బీఐ'ని పేర్కొన్నారని 'ఎక్స్' సంస్థే ధ్రువీకరించింది. ఈ ఆదేశాలు ఎవరు ఇచ్చారు? ఎఫ్‌బీఐ పేరును ఎందుకు దుర్వినియోగం చేశారు?" అంటూ జగన్ ప్రశ్నల వర్షం కురిపించారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల వైఫల్యం, డీఎస్సీ స్కామ్, అమరావతి దోపిడీ, రాష్ట్ర అప్పులు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడానికే ఈ కుట్ర చేశారా? అని ఆయన నిలదీశారు. పోలీసు యూనిఫాం చట్టాన్ని రక్షించడానికి ఉద్దేశించిందని, రాజకీయ సెన్సార్‌షిప్ కోసం కాదని హితవు పలికారు. ఈ చర్య ద్వారా విదేశీ దర్యాప్తు సంస్థ పేరును రాజకీయాల్లోకి లాగి ఆంధ్రప్రదేశ్ పరువును తీశారని, పోలీసు వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. విమర్శకుల గొంతు నొక్కేందుకు వెచ్చిస్తున్న శక్తిని సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల అమలుపై పెట్టాలని జగన్ సూచించారు. కరవుతో ఇబ్బంది పడుతున్న రైతులకు అండగా నిలవడం, ఉద్యోగాలు సృష్టించడం, రాష్ట్రాభివృద్ధిపై దృష్టి పెట్టడం వంటి పనులు చేయాలన్నారు. ప్రభుత్వం తన పనితీరుపై నమ్మకంతో ఉంటే, విమర్శలకు సెన్సార్‌షిప్‌తో కాకుండా పనితీరు, పారదర్శకతతో సమాధానం చెప్పాలని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

## అడ్డగోలు విద్యా సంస్థలపై యాక్షన్ షురూ

**గుంటూరు :** ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులను పావులుగా వాడుకుంటూ ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తున్న కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు నేర్పి, పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయాల్సిన సంస్థలు రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను రోడ్లపైకి ఎక్కించి ఆందోళనలు, నిరసనలు చేయిస్తుండటంపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇలాంటి అవాంఛనీయ చర్యలకు పాల్పడుతున్న నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.పోటీ పరీక్షల అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇప్పటికే తెచ్చిన ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనలు 2026 , జీవో నెంబర్ 9 మార్గదర్శకాలకు అనుగుణంగానే ప్రతి ప్రైవేటు కోచింగ్ సెంటర్ నడుచుకోవాల్సి ఉంటుంది. అయితే, నిబంధనలను బేఖాతరు చేస్తూ కొన్ని సంస్థల యజమానులు తెరవెనుక రాజకీయ వ్యవహారాలు నడుపుతున్నట్లు నిఘా వర్గాల పరిశీలనలో తేలింది. సంస్థలలో చేరిన అభ్యర్థులపై మానసిక ఒత్తిడి తెచ్చి, వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేలా ప్రేరేపిస్తున్నారని సీఎం దృష్టికి వచ్చింది.కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అభ్యర్థులను ఉద్దేశపూర్వకంగా ఆందోళనలకు పురిగొల్పుతున్నారని ప్రభుత్వం తేల్చింది. కెరీర్ నిర్మించుకోవాల్సిన అమూల్యమైన సమయంలో విద్యార్థులను రాజకీయ ప్రేరేపిత నిరసనల్లో భాగస్వాములను చేయడం తీవ్రమైన నేరమని ప్రభుత్వం హెచ్చరించింది. నిబంధనలను ఉల్లంఘించి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే సంస్థల గుర్తింపు రద్దు చేయడంతో పాటు, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.విద్యార్థులు, నిరుద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉందని, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం పునరుద్ఘాటించింది. అయితే ప్రైవేటు కోచింగ్ సెంటర్ల ముసుగులో రాజకీయ కుట్రలు పన్నుతూ వ్యవస్థలను అస్థిరపరచాలని చూస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. నిబంధనల పరిధిలోనే సంస్థలు కార్యకలాపాలు సాగించాలని, విద్యా వాతావరణాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించింది.

## లోకల్ ఎన్నికల కోసం రిజర్వేషన్ వివాదం

**తిరుపతి :** జీవో జారీ చేసినా ఏపీలో లోకల్ బాడీ ఎన్నికలు జరగవు.. బీసీలకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్లను కోర్టు కొట్టేస్తుంది, ఆ తర్వాత నెపాన్ని న్యాయస్థానాలపైకి నెట్టి ప్రభుత్వం నాటకాడుతుంది అని వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపణలు గుప్పిస్తున్నారు. మరోవైపు, ఎన్ని న్యాయపరమైన అడ్డంకులు వచ్చినా బీసీలకు 34 శాతం కోటా అమలు చేసి తీరుతాం అని టీడీపీ నాయకత్వం స్పష్టం చేస్తూ 'జయహో బీసీ' సభల ద్వారా తమ బీసీ ఓటు బ్యాంక్‌ను పటిష్టం చేసుకునే పనిలో పడింది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ వివాదం ఏమిటి? చంద్రబాబు సవాలు వెనుక ఉన్న రాజకీయ వ్యూహమేంటి? స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం జీవోలు విడుదల చేసింది. అయితే, సుప్రీంకోర్టు గతంలో పలు తీర్పుల్లో.. ఎస్సీ, ఎస్టీ, బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్ల మొత్తం శాతాన్ని 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టమైన గీత గీసింది. ప్రస్తుతం ఏపీలో ఎస్సీలకు 15%, ఎస్టీలకు 6% రిజర్వేషన్లు ఉన్నందున, బీసీలకు 34% ఇస్తే మొత్తం రిజర్వేషన్లు 55% నుండి 61% వరకు చేరుకుంటాయి. 2019లో కూడా అప్పటి ప్రభుత్వం 34% ఇస్తే హైకోర్టు , సుప్రీంకోర్టులు దాన్ని కొట్టివేశాయి. దీనివల్ల రిజర్వేషన్లు 50% దాటితే న్యాయపరంగా మళ్లీ చిక్కులు వస్తాయన్నది జగన్ వాదనకు ప్రాతిపదిక.చంద్రబాబు నాయుడు అనుభవజ్ఞుడైన నాయకుడు. కోర్టు తీర్పుల పరిమితి ఆయనకు తెలియనిది కాదు.

# వెలిగొండ కెనాల్‌లో వినాయక నిమజ్జనానికి నో పర్మిషన్!

**ఫీడర్ కెనాల్, ప్రాజెక్ట్ టన్నెల్‌లో నిమజ్జనాలకు అధికారిక అనుమతులు లేవు**

**ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లొద్దు.. నిర్వాహకులు, భక్తులు సహకరించాలి: సీఐ "అజయ్ కుమార్"**

**యర్రగొండపాలెం : సెప్టెంబర్ 17**
**(ప్రకాశం - మార్కాపురం జిల్లా ప్రతినిధి)**
వినాయక చవితి పర్వదినం సందర్భంగా వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలపై పోలీసులు కీలక హెచ్చరిక జారీ చేశారు. దోర్నాల మండల పరిధిలోని వెలిగొండ ఫీడర్ కెనాల్‌లో గానీ, వెలిగొండ ప్రాజెక్ట్ టన్నెల్‌లో గానీ వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి అధికారిక అనుమతులు లేవని యర్రగొండపాలెం సీఐ అజయ్ కుమార్ స్పష్టం చేశారు.

**అనుమతి లేని ప్రాంతాల్లో నిమజ్జనం వద్దు**
వెలిగొండ ప్రాజెక్ట్ పరిసరాల్లో నీటి ప్రవాహం, లోతు తదితర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు. అనుమతి లేని ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రమాదాలకు అవకాశం ఉన్నందున భక్తులు, నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సీఐ కోరారు.

**ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లొద్దు**
నిమజ్జనం పేరుతో ఎవరూ ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకూడదని, నీటిలోకి దిగే విషయంలో అత్యంత జాగ్రత్త వహించాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా యువత, చిన్నారులను ప్రమాదకర ప్రాంతాలకు తీసుకెళ్లకుండా నిర్వాహకులు, కుటుంబ సభ్యులు బాధ్యత వహించాలని కోరారు. అధికారులు సూచించిన ప్రాంతాల్లోనే నిమజ్జనం వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని అధికారులు సూచించిన, అధికారికంగా అనుమతి ఉన్న ప్రదేశాల్లో మాత్రమే నిర్వహించాలని సీఐ అజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు, సంబంధిత అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించి వినాయక చవితి వేడుకలను




ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు సహకరించాలని సీఐ అజయ్ కుమార్ కోరారు.

# విశ్రాంత డిఎస్ఓ అడపా ఉదయభాస్కర్ సంతాప సభ

**అమలాపురం, మీ వార్త ప్రతినిధి,** సెప్టెంబర్, 16 అంబేద్కర్ కోనసీమ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిగా పనిచేసి ఇటీవల పదవి విరమణ చేసి అకాల మరణం చెందిన అడపా ఉదయ భాస్కర్ సంతాప సభ జరిగింది. కోకో ఫెడ్ చైర్మన్, రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు అరిగెల బలరామమూర్తి అధ్యక్షతన డిఎస్ఓ విజయభాస్కర్ ఆధ్వర్యంలో సంతాప సభ జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయ-ప్రాంగణం ముమ్మిడివరం లో నిర్వహించారు. ఈ సందర్భంగాకోకో ఫెడ్ చైర్మన్, రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు అరిగెల బలరామ మూర్తి మాట్లాడుతూ దివంగత ఉదయభాస్కర్ పనిచేసిన రెండు సంవత్సరాల కాలంలో అటు అధికారులకు, వినియోగదారులకు, వినియోగదారుల సంఘ సభ్యులకు తలలోనాల్కలా ఉండి సమన్వయంతో కలిసి పనిచేసి తక్కువ కాలంలో ఎక్కువ సేవలు



అందించి, అందరి మన్ననలు పొందారనటంలో అతిశయోక్తి లేదని తెలియజేశారు. ఈ సమావేశంలో డిఎస్ఓ విజయభాస్కర్, డిఎం బాలసరస్వతి, అద్దంకి అమరేశ్వర రావు, బీవీవీ సత్యనారాయణలు ఉదయ్ భాస్కర్ సేవలను కొనియాడారు. ఈ సంతాపసభ కార్యక్రమంలో ఏఎస్ఓ చరణ్, జీవీఎల్ఎన్ శర్మ, కోనసీమ కన్స్యూమర్స్ వాలంటరీ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ జి ఎన్ రావు ,జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు అరిగెల రామారావు, జి. రవికుమార్,వర్మ,చౌక డిపోల సంఘ అధ్యక్షులు, పిడిఎస్ సిబ్బంది, ఇతర ఆఫీసు స్టాఫ్ తదితరులు పాల్గొని ఘనం గా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాల్గొన్న సభ్యులు అందరూ రెండు నిమిషాలు మౌనం పాటించి ఉదయ్ భాస్కర్ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

# వన సంరక్షణ సమితులకు షేరింగ్





**అమౌంట్ చెక్కులను పంపిణీ చేసిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు..**

**జీలుగుమిల్లి.( మీ వార్త ప్రతినిధి)** మండలంలోని కనకాపురం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం వన సంరక్షణ సమితి సభ్యులకు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు . జిల్లా అటవీ శాఖ అధికారి పివి సందీప్ రెడ్డి సభ్యులకు షేరింగ్ అమౌంట్ చెక్కు లను అందజేశారు . జీలుగుమిల్లి మండలంలోని కనకాపురం, జిల్లెల్లగూడెం, బుట్టాయిగూడెం మండలంలోని వెలుతురువారిగూడెం వన సంరక్షణ సమితుల అధ్యక్షులకు చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ, అటవీ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణతో పాటు అడవుల సంరక్షణలో వన సంరక్షణ సమితులు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. అడవులను కాపాడుతూ, పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని అటవీ సంరక్షణకు సభ్యులు మరింత కృషి చేయాలని సూచించారు. అనంతరం కనకాపురం ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే బాలరాజు మొక్కలు నాటారు . ఈ కార్యక్రమంలో సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ వెంకట సుబ్బయ్య, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దుర్గా కుమార్, ఎమ్మార్వో వెంకటేశ్వరరావు, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు, ఏఎంసీ చైర్మన్ పొట్ట రామారావు. కూటమి నాయకులు ఉండవల్లి సోమసుందరం, బండారు అనిల్ కుమార్, సుంకవల్లి సాయి, నాలి శ్రీనివాస్, రూపా సత్యనారాయణ, కొప్పుల శ్రీకాంత్, సొంటి రామకృష్ణ, పద్దం వెంకటకృష్ణ, కుంజా రమేష్, వీరంకి వెంకటేశ్వరరావు, గంటసాల అచ్యుతరామారావు, చిర్రి నాగరాజు, సిరిబత్తుల స్వామి, మందపాటి సూర్య, రాయి సుబ్బారావు, వనమా రాంబాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు..

# డ్రాఫ్ట్‌పై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి





**అన్ని పార్టీల నాయకులతో సాధారణ సమావేశం**

**పోలవరం మీ వార్త సెప్టెంబర్ 16** పోలవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సాధారణ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో, తహసీల్దార్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు సమావేశానికి హాజరయ్యారు.
డ్రాఫ్ట్ ప్రచురణ, పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై అధికారులు వివరించారు. పోలింగ్ బూత్‌ల విషయంలో ఏవైనా అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు ఉంటే తెలియజేయాలని సూచించారు.ప్రజలకు సౌకర్యంగా ఉండేలా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై నాయకులు తమ సూచనలు అందించాలని కోరారు.
డ్రాఫ్ట్‌లోని వివరాలను పరిశీలించి లోపాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అభ్యంతరాలు, సూచనలను నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.
ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని పార్టీల సహకారం అవసరమన్నారు. సమావేశంలో పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పలు అంశాలపై నాయకులతో అధికారులు చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి. మణికుమారి తహసీల్దార్, సాయి రాజు నాయకులు ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వైయస్సార్సీపి మండల అధ్యక్షులు బుగ్గ మురళి కృష్ణ టీడీపీ మండల అధ్యక్షులు మంగిన వెంకటరమణ శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి జనసేన మండల అధ్యక్షులు గునపర్తి చిన్ని సొసైటీ అధ్యక్షులు కొణతల ప్రసాద్ నీటి సంఘం అధ్యక్షులు పాదం ప్రసాద్ సొసైటీ అధ్యక్షులు నునకాని రాంబాబు టౌన్ ప్రెసిడెంట్ పోతుల శ్రీను కరిబండి నాగరాజు కుంజం సుభాషిని మడకం లక్ష్మి ఆకుల రాజా గుబ్బా రాంబాబు ఇళ్లా. సత్యనారాయణ పట్నాల నారాయణరావు తెలగం శెట్టి ప్రసాద్ వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పాయింట్ పెర్సన్లకు శిక్షణ.




**రౌతులపూడి సెప్టెంబర్ 15 :( మీ వార్త న్యూస్ ప్రతినిధి)** మండల వ్యవసాయ అధికారి రెడ్డి ఈశ్వరరావు ఆధ్వర్యం లో రైతు సేవ కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సహకారం తో బి. ఆర్. సి. పాయింట్ పర్సన్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రతి గ్రామ సంఘం నుండి ఎంపిక కాబడిన పాయింట్ పర్సన్లు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్. టి. రామరాజు ఈ సంవత్సరం ఏర్పడిన ఎల్ -నినో ప్రభావం వలన వాతావరం లో వచ్చే మార్పులు రైతులకు వివరించారు. దానికి తగట్టు గా పంటలు వేసే విధానంలో రైతులు అనుసరించవలసిన విధానాన్ని వివరించారు . పంట నమోదు అలాగే మిల్లెట్ సోయింగ్ గురించి మండల వ్యవసాయ శాఖ అధికారి రెడ్డి ఈశ్వరరావు శిక్షణ సమావేశంలో రైతులకు తెలియజేశారు. జరిగింది. ఈ సందర్భంగా సీసీ నాగమణి మాట్లాడుతూ బి. ఆర్. సి. లను లను బలోపేతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని దానికి తనవంతు సహకారం అందిస్తామన్నారు. బి. ఆర్. సి. పాయింట్ పర్సన్ పాత్ర చాలా విశ్లేష మైంది కాబట్టి పాయింట్ పర్సన్ బాధ్యతగా తమ విధులు నిర్వర్తించాలని ఎమ్. టి. వరలక్ష్మన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్. ఎమ్. టి.వాసం సతీష్, పి. వి. వి.సత్యనారాయణ , ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు .

## స్థానిక ఎన్నికలకు సమన్వయంతో పనిచేయాలి

**మండల అధ్యక్షుడు మంగిన వెంకట రమణ, శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి**



**పోలవరం మీ వార్త సెప్టెంబర్ 16** పోలవరం స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని టీడీపీ, కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు మంగిన వెంకట రమణ, ఏపీ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి సూచించారు.
పోలవరం మండల టీడీపీ కార్యాలయంలో మంగిన వెంకట రమణ అధ్యక్షతన కూటమి నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన జగదీశ్వరి మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం పెంచుకోవాలని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని సూచించారు. కూటమి నాయకులంతా ఐక్యంగా పనిచేస్తే పార్టీని మరింత బలోపేతం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు పాదం ప్రసాద్, పట్టిసీమ సొసైటీ అధ్యక్షుడు నునకాని రాంబాబు, ఐ టీడీపీ అధ్యక్షులు కోడి శీను క్లస్టర్ ఇన్‌చార్జి ఆకుల కొండబాబు, యూనిట్ ఇన్‌చార్జి పట్నాల శివనారాయణరావు, టౌన్ పార్టీ అధ్యక్షుడు పోతుల శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ కుంజం సుభాషిణి, కో-క్లస్టర్ ఇన్‌చార్జి గుబ్బ రాంబాబు, మడకం లక్ష్మి, జల్లేపల్లి నరసింహారావు, జల్లేపల్లి జతేంద్ర, కొణతల. దొరయ్య చేగొండపల్లి బూత్ ఇన్‌చార్జి బోరగం బుజ్జి, దొర శివ తదితరులు పాల్గొన్నారు.

## టిడ్కో లో కరెంట్ బిల్లులు చెల్లించే కౌంటర్



**అమలాపురం, మీ వార్త ప్రతినిధి,** సెప్టెంబర్, 16 అల్లవరం మండలంబోడస కుర్రు -దేవర్లంక టిడ్కోగృహ లబ్ది దారులుకోసం కరెంట్ బిల్లులు చెల్లించే కౌంటర్ ఏర్పాటు చేసారు. విద్యుత్ ఉప కేంద్రం వద్ద ప్రతి నెల 16తేదీ ఉదయం 7గంటలు నుండి మధ్యాహ్నం 12గంటల వరకు ఒక్క రోజు కట్టించు కుంటారు.
బుధవారం బిల్ కలెక్టర్ గిడ్ల విజయకుమార్ కరెంట్ బిల్లులు కట్టించు కున్నారు. టిడ్కో గృహలబ్ది దారులు ఈ అవకాశాన్ని విని యోగించు కోవాలి అనిబోడసకుర్రు టిడ్ కో ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి ఎన్ రావు తెలిపారు.

## ప్రగడపల్లి,పట్టిసీమలో పొలం పిలుస్తుంది కార్యక్రమం..

**మండల వ్యవసాయ అధికారి కే రాంబాబు**

**మినుము పంటలో కలుపు యాజమాన్యం,ఏపీ ఏఐఎంఎస్ 2.0 యాప్ గురించి అవగాహన..**




**పోలవరం మీ వార్త సెప్టెంబర్ 16** పోలవరం మండలం ప్రగడపల్లి,పట్టిసీమ గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయ అధికారి కే రాంబాబు అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులతో చర్చించి పలు సూచనలు చేశారు. అనంతరం మినుము పంటలో కలుపు యాజమాన్యంపై , వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న ఈ పంట నమోదు కార్యక్రమం, ఎరువులు సరఫరా ఏపీ ఏఐఎంఎస్ 2.0 యాప్ గురించి రైతులకు అవగాహన కల్పించారు.. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కే రాంబాబు మాట్లాడుతూ మినుము పంటలో పోస్ట్ ఎమర్జెన్సీ కలుపులు వాడేటప్పుడు తగినంత తేమ ఉండే విధంగా చూసుకోవాలని రైతులకు సూచించారు.. నన్ను పంటలో గడ్డి జాతి కలుపు మొక్కలు, ఆకుల కలుపు మొక్కలను గమనించడం జరిగినదన్నారు. సాధారణంగా మినుములో కలుపు మందులు వాడేటప్పుడు విత్తిన 15 నుండి 20 రోజుల్లోపు కలుపు మందులు వాడితే కలుపు నివారణ అవుతుందన్నారు . ఫెనోక్స్‌ప్రోప్ పి ఇతల్ 250 ఎం ఎల్ లేదా క్విజాలోపాప్ ఇతల్ 400 ఎం ఎల్ ఒక ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి చేనంతా తడిచే విధంగా పిచికారి చేసిన పంటలో కలుపు నివారించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే రాంబాబు, రైతు సేవా కేంద్రం సిబ్బంది హర్ష,కృష్ణ, కిరణ్ రైతులు పాల్గొన్నారు.

# రద్దైన ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

**మేనేజర్‌కు కూటమి నాయకుల వినతి**

**గోకవరం, సెప్టెంబర్ 16: ( మీ వార్త విలేఖరి )** గోకవరం ఆర్టీసీ డిపో నుంచి గతంలో రద్దు చేసిన బస్సు సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ కూటమి నాయకుల ఆధ్వర్యంలో డిపో మేనేజర్ ఎం. అజయ్ బాబుకు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ గోకవరం నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ, జగ్గంపేటతో పాటు ఏజెన్సీ ప్రాంతాలైన రంపచోడవరం, మారేడుమిల్లి, అడ్డతీగల ప్రాంతాలకు ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. అయితే గోకవరం ఆర్టీసీ డిపోలో బస్సుల కొరత కారణంగా గతంలో పలు సర్వీసులను రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.
గతంలో గోకవరం నుంచి విజయవాడ, విశాఖపట్నం, ద్రాక్షారామం, శ్రీశైలం తదితర ప్రాంతాలకు బస్సు సర్వీసులు ఉండేవని, ప్రస్తుతం అవి లేకపోవడంతో ప్రయాణికులు ఇతర మార్గాలపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. ఆ సర్వీసులను తిరిగి ప్రారంభించడంతో పాటు గోకవరం--జగ్గంపేట మధ్య గతంలో నడిచిన రెండు షటిల్ సర్వీసులను కూడా పునరుద్ధరించాలని కోరారు. విద్యార్థులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు







చేయాలి ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల కోసం గతంలో నడిచే స్టూడెంట్స్ స్పెషల్ బస్సు సర్వీసులను తిరిగి ప్రారంభించాలని నాయకులు కోరారు. ప్రస్తుతం బస్సుల కొరత కారణంగా విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రద్దీ సమయాల్లో బస్సులు సరిపోక విద్యార్థులు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొన్నారు.
గోకవరం డిపోకు అదనపు బస్సులను కేటాయించి, రద్దు చేసిన అన్ని ముఖ్యమైన సర్వీసులను దశలవారీగా పునరుద్ధరించాలని, ఈ సమస్యను ప్రభుత్వం మరియు ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపాలని కూటమి నాయకులు కోరారు.
డిపో మేనేజర్ ఎం. అజయ్ బాబు మాట్లాడుతూ కూటమి నాయకులు తెలిపిన సమస్యలను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.
ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పైలా శ్రీనివాసరావు, పల్లేల బాబి, పాలాడి శ్రీనివాసరావు, ఆచంట రాజు, గంగ్రెడ్డి సన్యాసిరావు, యాళ్ల శేషు, మొర్త చిట్టిబాబు, బీజేపీ నాయకులు సత్తి వెంకటరెడ్డి, ఉంగరాల ఆది విష్ణు, ముప్పిడి నాగేశ్వరరావు, మండిగ వెంకన్న దొర, జనసేన నాయకులు మహిపాల పాండురాజు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా "డాక్టర్ మన్నే రవీంద్ర"





**వేగినాటి కోటయ్య కాలనీలో భక్తులతో మమేకం.. ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం**

యర్రగొండపాలెం : సెప్టెంబర్ 17
**(ప్రకాశం - మార్కాపురం జిల్లా ప్రతినిధి)**
వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని యర్రగొండపాలెం మండలం వేగినాటి కోటయ్య కాలనీలో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ "డాక్టర్ మన్నే రవీంద్ర" ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులతో మమేకమయ్యారు. పండుగ వేడుకల్లో ఆయన పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యతను తీసుకొచ్చింది. ఈ సందర్భంగా డాక్టర్ మన్నే రవీంద్ర స్వయంగా వినాయక స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీ ప్రజలతో కలిసి ఉత్సవాల ఏర్పాట్లు, కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. గ్రామం, కాలనీ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, అందరికీ మంచి జరగాలని వినాయక స్వామివారిని ప్రార్థించారు.

**భక్తితో పాటు సేవా స్ఫూర్తికి ప్రాధాన్యం**
వినాయక చవితి ఉత్సవాల్లో కేవలం పూజా కార్యక్రమాలకే పరిమితం కాకుండా సేవా కార్యక్రమానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో డాక్టర్ మన్నే రవీంద్ర ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం అందించారు. పండుగ సందర్భంగా భక్తులకు ఆహారం అందించడం ద్వారా ఉత్సవాల్లో సేవా భావాన్ని చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించారు.

**స్థానికులతో ఆత్మీయంగా మమేకం**
కాలనీకి వచ్చిన డాక్టర్ మన్నే రవీంద్రను నిర్వాహకులు, స్థానికులు, యువత, భక్తులు ఆత్మీయంగా కలిశారు. ఉత్సవాల నిర్వహణలో యువత చురుగ్గా పాల్గొనడం, సామూహికంగా పండుగను నిర్వహించడం పట్ల ఆయన అభినందనలు తెలిపారు. భక్తి కార్యక్రమాలతో పాటు ప్రజల మధ్య ఐక్యత, పరస్పర సహకారం పెంపొందేలా ఇటువంటి కార్యక్రమాలు కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.

**పాల్గొన్న ప్రముఖులు**
ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి ఆంజనేయులు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు షేక్ జిలాని, మాజీ మండల రైతు సంఘం అధ్యక్షుడు పోతిరెడ్డి రమణారెడ్డి, విగ్నేష్ యూత్ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. కాలనీలో నిర్వహించిన పూజలు, అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వినాయక స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

# తౌషిక్ నుంచి మౌలాబి వరకు.. సమాధానం లేని ప్రశ్నలు!

సింగరాయకొండ : సెప్టెంబర్ 17
**(ప్రకాశం - మార్కాపురం జిల్లా ప్రతినిధి)**
ఒక కొడుకు మృతి... ఆ కొడుకు మృతికి న్యాయం కావాలని కన్నీళ్లతో పోరాడిన తల్లి... చివరకు అదే తల్లి కూడా ప్రాణాలు కోల్పోయిన విషాదం... ప్రకాశం జిల్లా సింగరాయకొండలో చోటుచేసుకున్న సయ్యద్ తౌషిక్--సయ్యద్ మౌలాబి ఘటన ఇప్పుడు సమాజం ముందు ఎన్నో ప్రశ్నలను నిలబెడుతోంది. శ్రీచైతన్య నవోదయ కోచింగ్ సెంటర్‌లో ఆరో తరగతి విద్యార్థి సయ్యద్ తౌషిక్ ఫిబ్రవరి 14న మృతిచెందిన ఘటనతో ఈ విషాదగాథ ప్రారంభమైంది. తౌషిక్ మృతిని తొలుత ఆత్మహత్యగా పేర్కొన్నప్పటికీ, తమ కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని తల్లిదండ్రులు మొదటి నుంచీ ప్రశ్నిస్తూ వచ్చారు. బిడ్డను కోల్పోయిన తల్లి సయ్యద్ మౌలాబి మాత్రం తన ఆవేదనను తనలోనే దాచుకోలేదు. "నా బిడ్డకు ఏం జరిగింది? నా బిడ్డ మృతికి కారణమేంటి? మాకు న్యాయం ఎప్పుడు జరుగుతుంది?" అంటూ అధికారులను ఆశ్రయిస్తూ, పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ, తన కుమారుడి మృతికి అసలు కారణం వెలుగులోకి రావాలని కోరుతూ నెలల తరబడి పోరాటం చేసినట్లు సమాచారం. ఒకవైపు బిడ్డను కోల్పోయిన తల్లి గుండెల్లో తీరని వేదన... మరోవైపు తన కుమారుడి మృతిపై సమాధానం కావాలన్న ఆరాటం... కాలం గడుస్తున్న కొద్దీ ఆ తల్లి ఆవేదన మరింత తీవ్రమైందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ వ్యవహారం చివరకు హైకోర్టు దృష్టికి వెళ్లగా, దర్యాప్తు తీరుపై కోర్టు ప్రశ్నలు లేవనెత్తినట్లు వార్తలు వెలువడ్డాయి. దర్యాప్తులో ఆలస్యం, పోస్టుమార్టం తదితర అంశాలపై కోర్టు దృష్టి సారించినట్లు సమాచారం. అనంతరం కొత్త దర్యాప్తు అధికారిని నియమించి పునర్విచారణ చేపట్టినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అంటే తౌషిక్ మృతిపై కుటుంబం మొదటి నుంచీ లేవనెత్తిన ప్రతి అనుమానానికి పూర్తిస్థాయిలో సమాధానం లభించిందా? దర్యాప్తులో తేలిన వాస్తవాలేమిటి? బాలుడు మృతిచెందిన పరిస్థితులపై అన్ని కోణాల్లో విచారణ జరిగిందా? పాఠశాల, హాస్టల్‌లో విద్యార్థుల భద్రతకు సంబంధించిన నిబంధనలు పూర్తిగా అమలయ్యాయా? విద్యార్థుల పర్యవేక్షణలో ఎక్కడైనా లోపం జరిగిందా? తల్లిదండ్రులు లేవనెత్తిన అనుమానాలపై అధికారులు ఏం తేల్చారు? అనే ప్రశ్నలు ఇప్పుడు మరోసారి తెరపైకి వస్తున్నాయి. ఇంతలోనే కొడుకు కోసం న్యాయం కోరుతూ పోరాడిన సయ్యద్ మౌలాబి సెప్టెంబర్ 10న పాఠశాల ఎదుట పురుగుల మందు తాగినట్లు వార్తలు వెలువడ్డాయి. ఆమెను




ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ సెప్టెంబర్ 12న మృతిచెందినట్లు సమాచారం. ఒక తల్లి తన బిడ్డను కోల్పోయింది... ఆ బిడ్డ కోసం న్యాయం కోరుతూ పోరాడింది... చివరకు ఆ తల్లినే కుటుంబం కోల్పోయింది. ఇప్పుడు ఈ ఘటన కేవలం ఒక కుటుంబ విషాదంగా కాకుండా, వ్యవస్థను ప్రశ్నించే స్థాయికి చేరుకుంది. తౌషిక్ మృతికి అసలు కారణమేంటి? అతను మృతిచెందిన పరిస్థితులపై లేవనెత్తిన అనుమానాలు పూర్తిగా నివృత్తి అయ్యాయా? పాఠశాల, హాస్టల్ నిర్వహణలో నిబంధనలు పాటించబడ్డాయా? విద్యార్థుల భద్రత విషయంలో సంబంధిత యంత్రాంగం తన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించిందా? తౌషిక్ మృతిపై కుటుంబం చేసిన ఫిర్యాదులు, విజ్ఞప్తులు, నిరసనలపై అధికారులు తీసుకున్న చర్యలేమిటి? దర్యాప్తు ప్రక్రియలో ఎక్కడైనా లోపాలు జరిగాయా? హైకోర్టు జోక్యానికి దారితీసిన పరిస్థితులేమిటి? అన్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉంది. అదే సమయంలో మౌలాబి తీవ్ర నిర్ణయానికి దారితీసిన పరిస్థితులపై కూడా సమగ్రంగా పరిశీలన జరగాల్సిన అవసరం ఉంది. ఆమె ఎందుకు అంతటి వేదనకు గురయ్యారు? తన కుమారుడి మృతిపై న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఎందుకు కలగలేదు? నెలల తరబడి న్యాయం కోసం పోరాడిన ఆమె చివరకు ఇంతటి విషాద నిర్ణయానికి ఎందుకు వెళ్లాల్సి వచ్చింది? ఇవి కూడా సమాజం ముందున్న ప్రశ్నలే. ఎవరినీ ముందుగానే నిందితులుగా ప్రకటించడం కాదు... ఎవరినీ రక్షించాలనే ఉద్దేశం కూడా కాదు... కానీ ఒక బాలుడి ప్రాణం పోయిన తర్వాత, అతని తల్లి కూడా ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో నిజం ఏమిటో తెలుసుకునే హక్కు ఆ కుటుంబానికే కాదు, సమాజానికీ ఉంది. ఎవరి తప్పు ఉన్నా ఆధారాలతో తేలాలి... ఎక్కడైనా నిర్లక్ష్యం జరిగి ఉంటే బాధ్యత నిర్ణయించాలి... నిబంధనల ఉల్లంఘన జరిగి ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి... దర్యాప్తులో తప్పిదాలు ఉంటే అవి కూడా వెలుగులోకి రావాలి. ఎందుకంటే పాఠశాల అంటే పిల్లల భవిష్యత్తును నిర్మించే స్థలం... పిల్లల భద్రతకు తల్లిదండ్రులు నమ్మకంతో అప్పగించే స్థలం... భయం, అనుమానం, కన్నీళ్లకు నిలయంగా మారకూడదు. తౌషిక్ తిరిగి రాడు... మౌలాబి కూడా తిరిగి రారు... కానీ వారి మరణాలు లేవనెత్తిన ప్రశ్నలకు మాత్రం సమాధానం రావాలి. ఆ సమాధానం ఆరోపణలతో కాదు... ఆధారాలతో రావాలి. పుకార్లతో కాదు... నిష్పక్షపాత దర్యాప్తుతో రావాలి. ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా నిజం వెలుగులోకి రావాలి. ఒక తల్లి కన్నీటికి విలువ ఉండాలి... ఒక విద్యార్థి ప్రాణానికి విలువ ఉండాలి... తల్లిదండ్రుల నమ్మకానికి విలువ ఉండాలి... ముఖ్యంగా ఒక బాలుడి మరణం తర్వాత న్యాయం కోసం పోరాడిన తల్లి కూడా ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఎందుకు ఏర్పడిందో వ్యవస్థ సమాధానం చెప్పాలి. తౌషిక్ మృతికి నిజం వెలుగులోకి రావాలి... మౌలాబి మరణానికి దారితీసిన పరిస్థితులు కూడా వెలుగులోకి రావాలి... ఎవరైనా తప్పు చేసి ఉంటే ఆధారాలు తేల్చాలి... ఎక్కడ లోపం జరిగిందో దర్యాప్తు స్పష్టం చేయాలి... నిజం ఏమిటో చట్టం తేల్చాలి. ఒక తల్లి కన్నీరు ఆగిపోయినా... ఆమె అడిగిన న్యాయ ప్రశ్న మాత్రం ఆగకూడదు. తౌషిక్ కోసం సమాధానం కావాలి... మౌలాబి కోసం సమాధానం కావాలి... రేపటి ప్రతి తల్లిదండ్రి నమ్మకం కోసం సమాధానం కావాలి.

## ఆళ్ల నాని పార్థివదేహానికి గడ్డమణుగు రవికుమార్ ఘన నివాళి..



జీలుగుమిల్లి. (మీ వార్త ప్రతినిధి) మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు మాజీ శాసనసభ్యులు ఆళ్ల నాని గారి మృతి పట్ల మాజీ జెడ్పీటీసీ, జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ద్వారకాతిరుమల శ్రీ చిన్న వెంకన్న స్వామివారి దేవస్థానం స్టేట్ ట్రస్టు బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు గడ్డమణుగు రవికుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.
బుధవారం ఏలూరులోని ఆళ్ల నాని స్వగృహానికి వెళ్లిన రవికుమార్, ఆయన పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆళ్ల నాని గారితో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని ఆయన స్మరించుకున్నారు. 1998లో తామిద్దరం యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కలిసి పనిచేశామని, అప్పటి నుంచి నానితో తనకు వ్యక్తిగతంగా ఎంతో ఆత్మీయ అనుబంధం కొనసాగిందని రవికుమార్ గుర్తుచేసుకున్నారు. ప్రజా జీవితంలో నానితో కలిసి పనిచేసిన అనుభవాలను స్మరించుకుంటూ, ఆయన మృతి తీరని లోటని అన్నారు. ఆళ్ల నాని అకాల మరణం ఏలూరు ప్రజలకు మాత్రమే కాకుండా ఉమ్మడి జిల్లాలోని ప్రజానీకానికి, ఆయనను నమ్ముకుని పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు పూడ్చలేని లోటని రవికుమార్ పేర్కొన్నారు. .

## వినాయక చవితి సంధర్భంగా చేనేత కార్మికులుకు నిత్యావసర సరుకుల వితరణ"



**పెదన సెప్టెంబర్ 16(మీ వార్త ప్రతినిధి)** అవసరమన్న వారిని ఆదుకోవాలనే నానుడి నిజం చేస్తూ పెదన శ్రీ బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల లైబ్రరీసైన్స్ అధ్యాపకులు పేరిశెట్టి నాగరవి ఆధ్వర్యంలో పెదన 11వ వార్డులో మరియు కప్పలదొడ్డి లోని దివ్యాంగులు , ఆర్థిక ఇబ్బందులు మరియు అనారోగ్యంతో బాధపడుతున్న చేనేత కళాకారులకు కొంతైనా ఊరట నివ్వాలనే సదుద్దేశంతో వినాయక చవితి సంధర్భంగా మిత్రులు పిచ్చుక లక్ష్మీ కుమారి మరియు గుత్తి డి కే సుబ్బారాయుడు అందించిన ఆర్థిక సౌజన్యంతో సుమారు పదివేల విలువైన నెల రోజులకు సరిపడు బియ్యం మరియు నిత్యావసర వస్తువులను కొసనం భ్రమరాంబ ,పేరిశెట్టి ఈశ్వరి,చంద్రనాగమ్మ , యక్కల లక్ష్మీ సంబంధించిన నాలుగు చేనేత కుటుంబసభ్యులకు అందజేయడం జరిగిందని లైబ్రరీసైన్స్ అధ్యాపకులు నాగరవి పేరిశెట్టి తెలియజేస్తూ దాతలు కోరిక మేరకు తూచాతప్పకుండా అర్హులను ఎన్నుకున్నామని , ఇక ముందు కూడా దాతలు అవసరమైన వారికి సదుపాయాలు కల్పించాలని కోరుతూ దాతలు ధన్యవాదాలు తెలియజేసారు. ఈకార్యక్రమంలో పేరిశెట్టి నాగరవి ,బూసం సాయిబాబు బళ్ళ నాగేశ్వరరావు ,చేనేత కళాకారులు పాల్గొన్నారు.

## ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి: ప్రముఖ లాయర్ రూపా రాణి, జర్నలిస్ట్ బ్రహ్మం



**గూడూరు సెప్టెంబర్ 16(మీ వార్త ప్రతినిధి)**పెడన నియోజకవర్గం గూడూరు మండలం కప్పలదొడ్డి నెహ్రూ కాలనీలో ఏర్పాటు చేసిన గణేశ్ పూజలో ప్రముఖ లాయర్ పి రూపా రాణి, కృష్ణాజిల్లాఇంచార్జ్ మీ వార్త విలేకరి పి సిద్ధ లింగయ్య (బ్రహ్మం ) పాల్గొన్నారు.దంపతులు కలిసి మండపంలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగను ప్రజలంతా,సుఖసంతోషాలతో చేసుకోవాలనిసూచించారు. ప్రమాదాలకు దూరంగా, ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు.మూడు రోజుల నుంచి గణపతి పూజలు నిర్వహించి గురువారం ఊరేగింపు సందర్భంగా మన విలేఖర సోదర కుటుంబాలు, మధ్యాహ్నం అన్న సమారాధన అనంతరం ఊరేగింపులో పాల్గొనవలసిందిగా కోరుకొనుచున్నాము.

## పంట కోత ప్రయోగాలపై శిక్షణ

**మండల వ్యవసాయ అధికారి జి. రామకృష్ణ**



**గూడూరు సెప్టెంబర్ 16(మీ వార్త ప్రతినిధి)** గూడూరు మండలంలోని రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్కే) అసిస్టెంట్లకు పంట కోత ప్రయోగాలు (సి సి ఈ) నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. వరి పంట కోత ప్రయోగాలను నిర్ణీత విధానంలో, అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని అధికారులు సూచించారు. ప్రయోగాల వివరాలను ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నమోదు చేయాలని తెలిపారు. పంట కోత ప్రయోగాలకు సంబంధించిన ఫారం-1ను వెంటనే సబ్మిట్ చేయాలని ఆర్ఎస్కే అసిస్టెంట్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్వో , మండల వ్యవసాయ అధికారి జి. రామకృష్ణ, ఆర్ఎస్కే అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## వీఆర్ఏల డిమాండ్ల సాధనకు సామూహిక నిరాకరణ సమ్మె



**గూడూరు సెప్టెంబర్ 16 (మీ వార్త ప్రతినిధి)** గూడూరు: ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏలు) తమ డిమాండ్ల సాధన కోసం బుధవారం గూడూరు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సామూహిక నిరాకరణ సమ్మె నిర్వహించారు. వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని, అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షుడు పి. వీర వేంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కుంపటి ఉయ్యూరు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వము తమ డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు.

# సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు..

**జీలుగుమిల్లి. (మీ వార్త ప్రతినిధి)** :అనారోగ్యంతో వైద్య చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బుధవారం జీలుగుమిల్లి మండలంలోని జీలుగుమిల్లి, పి. రాజవరం, దర్భగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు స్వయంగా బాధితుల ఇళ్లకు వెళ్లి సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. బాధిత కుటుంబ సభ్యులను ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పి. రాజవరం గ్రామానికి చెందిన సింహాద్రి అచ్యుతారామయ్యకు రూ.37,000, జీలుగుమిల్లికి చెందిన బొర్రా కోటేశ్వరరావుకు రూ.50,000, దర్భగూడెం గ్రామానికి చెందిన పల్లంటి వెంకన్నకు సుమారు రూ.33,000 విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బాలరాజు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వైద్య ఖర్చులు భారంగా మారుతున్నాయని, అలాంటి



కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో వారి వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చిర్రి కృష్ణయ్య, బండారు అనిల్, రూపా సత్యనారాయణ, కొప్పుల శ్రీకాంత్,పద్దం వెంకటకృష్ణ,రాయి సుబ్బారావు, తమ్మన సాంబశివరావు, చిరంజీవి, అక్కిశెట్టి ప్రసాద్, హనుమంతురావు, తొమ్మిదేళ్ల దుర్గా ప్రసాద్, సురేశెట్టి మహేష్, ఉప్పులూరి శ్రీను, గూడపాటి పుల్లారావు, జాస్తి సత్యనారాయణ, సూరిశెట్టి శ్రీను, చిర్రి నాగరాజు, వెలగల అజయ్ తదితరులు పాల్గొన్నారు..

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఉపాధ్యాయులకు శిక్షణ ..

**టీచింగ్ టు ట్రాన్స్ ఫార్మింగ్ వైపు అడుగులు అనే నినాదంతో..**

**కోటగిరి రంగారావు మెమోరియల్ టీచర్స్ డెవలప్‌మెంట్ సమ్మిట్ 2026.**

**తల్లాడ మీ వార్త ప్రతినిధి సెప్టెంబర్ 16,** కెఎస్ఎం విద్యాసంస్థల వ్యవస్థాపకులు కోటగిరి రంగారావు 15వ వర్ధంతి సందర్భంగా ఉపాధ్యాయుల అభివృద్ధి,ఆధునిక విద్యా విధానాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో బాలభారతి విద్యాలయంలో కోటగిరి రంగారావు మెమోరియల్ టీచర్స్ డెవలప్‌మెంట్ సమ్మిట్ 2026 కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో బాలభారతి ప్రీమియర్ లీగ్ క్రీడా పోటీలను ప్రారంభించారు. క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలకు శ్రీకారం చుట్టారు. క్రీడా జ్యోతి వెలిగించడం ద్వారా క్రమశిక్షణ,ఐక్యత, క్రీడాస్ఫూర్తి,పట్టుదల వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. బోధన నుంచి పరిశోధన వైపు 2030 నాటికి బాలల కోసంఉపాధ్యాయులను సిద్ధం చేయడం అనే ప్రధాన అంశంతో నిర్వహించిన ఈ సదస్సులో ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేయడం,ఆధునిక విద్యా విధానాలను తరగతి గదిలో సమర్థవంతంగా వినియోగించడం వంటి అంశాలపై





శిక్షణ,అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తల్లాడ మండల విద్యాధికారి దామోదర వరప్రసాద్ ను,ఆ విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్,డైరెక్టర్ కోటగిరి శ్రావణి,ప్రిన్సిపాల్ రామారావు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సదస్సులో ఉపాధ్యాయుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,సైన్స్ ప్రయోగాలు,క్రియేటివిటీ,టిఎల్ఎం తదితర అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. ఆధునిక సాంకేతికతను విద్యాబోధనలో సమర్థవంతంగా వినియోగిస్తూ విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించే విధానాలపై వివరించారు. కేఎస్ఎంవిద్యాసంస్థల అభివృద్ధికి కోటగిరి రంగారావుఅందించిన సేవలను ఈ సందర్భంగా పలువురు స్మరించుకున్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రతి విద్యార్థికి మెరుగైన విద్యా అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సద్వ్యవహారం పంచుకోవడం,ఆదరించడం,పరివర్తన తీసుకురావడం అనే స్ఫూర్తితో విద్యార్థుల్లో విలువలను పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కే ఎస్ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్,డైరెక్టర్ కోటగిరి శ్రావణి, ప్రముఖ వ్యాపారవేత్త దారా విష్ణు మోహన్ రావు, సీనియర్ జర్నలిస్ట్ దుగ్గిదేవర అజయ్ కుమార్, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓజోన్ దినోత్సవం

**చింతూరు,సెప్టెంబర్ 16 మీ వార్త ప్రతినిధి :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఓజోన్ దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఎన్.మణిమాల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ జీవరాశికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొరకు ఏర్పడిన రంధ్రం కారణంగా కలిగే నష్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపల్ ముల్లి.శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యతగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం,చెట్లను పెంచడం పర్యావరణహిత జీవన విధానాలను పాటించటం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. రసాయనిక శాస్త్ర అధ్యాపకులు డా.శివకృష్ణ మాట్లాడుతూ ఓజోన్ పొర క్షీణించడం వల్ల గ్లోబల్ వార్మింగ్,చర్మవ్యాధులు, కంటి సమస్యలు,రోగ నిరోధక శక్తి తగ్గడం వంటి దుష్పరిణామాలు వస్తాయని




తెలియజేశారు. జువాలజీ డిపార్ట్మెంట్ జి.సాయికుమార్ మాట్లాడుతూ వాతావరణంలో స్ట్రాటోస్ఫియర్ పొరలో ఉండే ఓజోన్ వాయువు సూర్యుని నుండి వచ్చే హానికరమైన అల్ట్రా వయొలెట్ యు వి కిరణాల నుండి భూమిని ఎలా రక్షిస్తుందో వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై. పద్మ,ఎం.రాకేష్ రాజ్,డా. ఝాన్సీ,బి. శ్రీనివాసరావు, ఆనంద్ కోట్ల.లక్ష్మీ ప్రసన్న, కే.కీర్తి మరియు విద్యార్థినీ, విద్యార్థులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది హాజరయ్యారు.

# అధికారుల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యం 'తైడా' పాఠశాల.

**రేకుల షెడ్డులోనే విద్యార్థుల అవస్థలు.**

**అనంతగిరి,సెప్టెంబర్ 16 ( మీ వార్త )** విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని, కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న మాటలు క్షేత్రస్థాయిలో నీటి మూటలుగానే మిగులుతున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని కొండిబ పంచాయతీ పరిధిలో గల తైడా గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దుస్థితి ఇందుకు అద్దం పడుతోంది. దశాబ్దాలు మారుతున్నా ఈ పాఠశాలకు కనీసం ఒక శాశ్వత భవనం కూడా భాగ్యం నోచుకోకపోవడం అధికారుల,పాలకుల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. వర్షం వస్తే సెలవే! ప్రస్తుతం ఈ పాఠశాలలో 14 మంది గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి కనీస వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ప్రస్తుతం ఒక రేకుల షెడ్డులోనే ఈ విద్యార్థులకు విద్యాబోధన సాగుతోంది. ఈ తాత్కాలిక షెడ్డు ఎండాకాలంలో సెగలు గక్కుతుండగా,వర్షాకాలంలో విద్యార్థులకు నరకప్రాయంగా మారుతోంది. స్వల్ప వర్షం కురిసినా



రేకుల పైకప్పు నుండి నీరు లోపలికి చేరి, క్లాస్ రూమ్ అంతా బురదమయంగా మారుతోంది. పుస్తకాలు తడిసిపోతుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరగతి గది మొత్తం నీటితో నిండిపోవడంతో విద్య బోధన సాగక, వర్షం వచ్చిన ప్రతిసారీ పాఠశాలకు అప్రకటిత సెలవు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. చెప్పులరిగేలా తిరిగినా పట్టించుకోని పాలకులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, పాఠశాలకు శాశ్వత భవనాన్ని మంజూరు చేయాలని తైడా గ్రామస్తులు సుదీర్ఘ కాలంగా పోరాడుతున్నారు. మండల స్థాయి అధికారుల నుండి జిల్లా అధికారుల వరకు,ఐటీడీఏ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులకు,అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా కేవలం హామీలతోనే సరిపెడుతున్నారని,గిరిజన ప్రాంతాల్లో విద్య పట్ల అధికారులకు ఉన్న నిర్లక్ష్యానికి ఇది పరాకాష్ట అని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఐటీడీఏ అధికారులు స్పందించాలి.."డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, అత్యాధునిక వసతుల గురించి మాట్లాడే పాలకులు..కనీసం కూర్చోవడానికి గది లేని మా పిల్లల పరిస్థితిని ఎందుకు పట్టించుకోవడం లేదు?" అని గిరిజన సంఘాల నేతలు,విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్,ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ప్రత్యేక శ్రద్ధ వహించి, తైడా గ్రామానికి తక్షణమే నూతన పాఠశాల భవనాన్ని మంజూరు చేయాలని,గిరిజన విద్యార్థులకు నాణ్యమైన చదువు అందేలా చూడాలని గ్రామస్తులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# బాలగణపతి ఆలయంలో మూడో రోజు పూజ కార్యక్రమాలు లో పాల్గొన్న- మాజీ సర్పంచ్ అడబాల తాతకాపు .



**మామిడికూతదురు సెప్టెంబర్ 16 ( మీ వార్త విలేఖరి రవి).** లూటుకూర్రు గ్రామం బాల గణపతి ఆలయం వద్ద వినాయక చవితి సందర్భంగా మూడవరోజు పూజా కార్యక్రమంలో పి గన్నవరం నియోజకవర్గం సర్పంచ్ సమక్ష అధ్యక్షులు,మాజీ జనసేన మండల అధ్యక్షులు,మాజీ సర్పంచ్ అడబాల తాతకాపు కుటుంబ సమేతంగా పూజా కార్యక్రమంలో పాల్గొని ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆరోగ్యం కోసం,స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గురించి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

# పెంటపాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ప్రపంచ ఓజోన్ దినోత్సవం



**పెంటపాడు సెప్టెంబర్ 16 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం డీఆర్జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ శ్రీమన్నారాయణ అధ్యక్షత వహించి ఓజోన్ పొర ప్రాధాన్యతను గురించి వివరించారు. ఓజోన్ పొర క్షీణిస్తే మానవాళికి, పర్యావరణానికి జరిగే నష్టాన్ని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం పర్యావరణానికి హాని కలిగించే వివిధ అంశాల గురించి రసాయన శాస్త్ర విభాగాధిపతి విక్టర్ ప్రేమ్ సాగర్, భౌతిక శాస్త్ర విభాగాధిపతి వెంకటేశులు రెడ్డి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ సీసీ, ఎన్ ఎస్ ఎస్, రసాయన శాస్త్ర అధ్యాపకులు సురేంద్ర, డాక్టర్ శాంత కుమారి, భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# వినాయక చవితి సందర్భంగా డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగంపై ముందస్తు చర్యలు..

**14మంది డిజె ఆపరేటర్లను బైండోవర్ చేసిన ఎస్సై జగదీశ్వర్...**



**చిగురుమామిడి సెప్టెంబర్ 16 (మీ వార్త విలేకరి):** మండలంలోని 17గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా డిజె సిస్టమ్స్ వినియోగించడంపై ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చిగురుమామిడి ఎస్ఐ జగదీశ్వర్ హెచ్చరించారు. చిగురుమామిడి మండలంలోని 14మంది డీజే ఆపరేటర్లను తహసిల్దార్ ఎదుట బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఎస్సై జగదీశ్వర్ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు,నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. వినాయక చవితి ఉత్సవాలు,ఊరేగింపుల సమయంలో డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగించరాదని వారికి స్పష్టంగా సూచించడంతో పాటు,పోలీసుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించడం జరిగిందన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా,శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరఫున అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై వివరించారు.

# రామన్నపేటలోని అయినంపూడి డ్రెయిన్ గుర్రపు డెక్క తొలగింపు

**పీఏసీఎస్ అధ్యక్షుడు మురాల ధనేష్ పర్యవేక్షణలో**



**గూడూరు సెప్టెంబర్ 16 (మీ వార్త ప్రతినిధి)** గుర్రపు డెక్క తొలగింపు గూడూరు మండలం రామన్నపేటలోని అయినంపూడి డ్రెయిన్ గుర్రపు డెక్కతో నిండిపోవడంతో మురుగునీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడింది. దీంతో పీఏసీఎస్ అధ్యక్షుడు మురాల ధనేష్ పర్యవేక్షణలో డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించారు. స్థానికులకు ఇబ్బందులు లేకుండా డ్రెయిన్‌ను శుభ్రం చేయించారు. కార్యక్రమం లో గ్రామ పార్టీ ప్రెసిడెంట్ వీర వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

# పెడన యు పి హెచ్ సి బంటుమిల్లి రోడ్డు సచివాలయం నందు ఫీవర్ సర్వే



**పెడన సెప్టెంబర్ 16(మీ వార్త ప్రతినిధి)** ఈరోజు పెడన యు పి హెచ్ సి పరిధిలో బంటుమిల్లి రోడ్ 4.వ సచివాలయం నందు ఫీవర్ సర్వే ఉహెల్త్ ఎడ్యుకేషన్ చేయటం జరిగింది. ఈ కార్యక్రమం లో హెల్త్ సూపర్ వైజర్ భట్రాజు సూరిబాబు , హెల్త్ అసిస్టెంట్ సతీష్ బాబు , ఏ ఎన్ ఎం సి హెచ్. అంజన దేవి గారు, ఆశ వర్కర్స్ కె. లక్ష్మి నరసమ్మ, ఎం. లత గార్లు పాల్గొన్నారు.

## పెంటపాడులో టీడీపీ మండల సమావేశం

స్థానిక సంస్థల ఎన్నికలపై బాబ్జి దిశ నిర్దేశం



**పెంటపాడు, సెప్టెంబర్ 16 (మీ వార్త ప్రతినిధి)** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై పెంటపాడు మండల సమావేశంలో పార్టీ నాయకులు కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఇంచార్జ్ వలవల బాబ్జి దిశా నిర్దేశం చేశారు. టిడిపి పెంటపాడు మండల అధ్యక్షులు కిలపర్తి వెంకట్రావు ఆధ్వర్యంలో పెంటపాడులో మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) హాజరయ్యారు.ఈ సమావేశంలో బాబ్జి మాట్లాడుతూ స్థానిక ఎన్నికల రిజర్వేషన్లు మరియు శాతాలు అధిష్టానం నిర్ణయిస్తుందని తెలియజేశారు. క్రమశిక్షణతో పార్టీ ఏది చెబితే ఆ విధంగా ముందుకు వెళ్దామని అన్నారు. రిజర్వేషన్ పూర్తయిన తర్వాత మాత్రమే ఎవరు ఏ పదవికి పోటీ చేయాలన్నది తెలుస్తుందని అన్నారు. పైన అధిష్టానం ఏ విధంగా చెబుతుందో అలాగే ముందుకు వెళ్దామని అన్నారు.ఇప్పుడు మున్సిపాలిటీని కూడా ఎవరికో ఇస్తే తెలుగుదేశం అస్తిత్వం కోల్పోవడం జరుగుతుందని అన్నారు. అధినాయకత్వం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉందామని అన్నారు. అయితే అస్తిత్వం కోల్పోవడానికి ఎవరూ సిద్ధంగా లేరని తెలిపారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ గల పార్టీ అని ఎవరూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడవద్దని కోరారు.ఈ కార్యక్రమంలో దాసరి అప్పన్న,కొల్లూరి హేమ వీర వెంకటరామయ్య (బాబు), పాతూరి రాంప్రసాద్ చౌదరి, బుద్దన ధనరాజు, పసల చంటి, ములగాల బాబ్జి, కొండపల్లి శ్రీను,పడాల ఉమాశంకర్, కొల్లూరి నాగరాజు,తెలుగుదేశం పార్టీ క్లస్టర్, యూనిట్ మరియు బూత్ ఇంచార్జీలు, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 29న పాఠశాలల ఎస్ఎంసి ఎన్నికలు.

పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం.

ఎంఈఓ బాలాజీ.



**అనంతగిరి,సెప్టెంబర్ 16 ( మీ వార్త )** అనంతగిరి మండల పరిధిలోని 175 పాఠశాలల్లో పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ పునర్నిర్మాణ ఎన్నికలను సెప్టెంబర్ 29న నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి కే.బాలాజీ తెలిపారు.బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఎంసి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.సెప్టెంబర్ 29 ఉదయం 7.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు పోలింగ్ జరుగుతుందని అన్నారు.అదే రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు కమిటీ చైర్పర్సన్,వైస్ చైర్పర్సన్ల ఎన్నిక నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు.ఈ కమిటీలలో 75 శాతం ప్రాతినిధ్యం విద్యార్థుల తల్లిదండ్రులకే ఉంటుందని అన్నారు. అలాగే మొత్తం కమిటీ స్థానాల్లో 50 శాతం మహిళలకు కేటాయించడం జరుగుతుందని తెలిపారు.పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములను చేయడమే లక్ష్యంగా ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నామని, సకాలంలో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఎంఈఓ కే బాలాజీ తెలిపారు...

## ఓటర్లకు ఇబ్బంది లేకుండా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు.

వైసీపీ మండల అధ్యక్షుడు కొర్ర సూర్యనారాయణ





**అనంతగిరి,సెప్టెంబర్ 16 ( మీ వార్త )** రానున్న స్థానిక సంస్థల (ఎంపీటీసీ,జడ్పీటీసీ) ఎన్నికల నేపథ్యంలో అనంతగిరి మండల ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల మార్పులు,చేర్పులపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు.ఎంపీడీవో ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతగిరి మండల అధ్యక్షుడు కొర్ర సూర్యనారాయణ,మండల పరిశీలకులు ఎస్. సన్యాసిరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను ప్రదర్శించారు.మండల వ్యాప్తంగా మొత్తం 38,682 మంది ఓటర్లకు గాను 49 పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించినట్లు అధికారులు తెలిపారు.దీని ప్రకారం సగటున ఒక్కో కేంద్రానికి 755 మంది ఓటర్లు రానున్నారు.సమావేశంలో కొర్ర సూర్యనారాయణ మాట్లాడుతూ..గత ఎన్నికల్లో ఉన్న కేంద్రాలకు అదనంగా ఓటర్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో, ముఖ్యంగా గిరిజన గ్రామాల ప్రజల సౌకర్యార్థం కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను ఓటర్లకు అందుబాటులోకి తీసుకురావాలని చర్చించారు. ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచనల మేరకు ఏ ఒక్క ఓటరుకు ఇబ్బంది కలగకుండా,అత్యంత పారదర్శకంగా పోలింగ్ కేంద్రాలను ఖరారు చేయాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో వైసీపీ అనంతగిరి మండల బూత్ కమిటీ ఇన్చార్జ్ సెంబి సుందర్ రావు,వివిధ పార్టీల అఖిలపక్ష నాయకులు,ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత హి సేవ కార్యక్రమంపై కమిషనర్ సమీక్ష



**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 16 (మీ వార్త ప్రతినిధి)** తాడేపల్లిగూడెం పురపాలక సంఘం కమిషనర్ ఎం. యేసుబాబు తన చాంబర్ లో అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పారిశుధ్య తనిఖీ అధికారులు, పర్యావరణ విభాగపు ఇంజినీర్లు, సహాయ ఇంజినీర్లు మరియు పారిశుధ్య కార్యదర్శులు పాల్గొన్నారు. పురపాలక శాఖ డైరెక్టర్ వారి వీడియో సమావేశంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంపై ఇచ్చిన ఆదేశాలను కమిషనర్ అన్ని విభాగాల అధిపతులకు వివరించారు.కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా రేపటి నుంచి ప్రతిరోజూ జరిగే కార్యక్రమాలను, సమయాలను వివరించారు.రేపటి నుండి ప్రతిరోజూ నిర్దేశించిన ప్రాంతంలో ప్రతి పౌరుడు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు, మీడియా ప్రతినిధులు భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి సచివాలయం పరిధిలో శుభ్రత కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉంచడంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు.తాడేపల్లిగూడెం పట్టణంలోని ప్రతి పౌరుడు స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యి తాడేపల్లిగూడెం మొదటి స్థానం సాధించడంలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ డి. భవాని బాబు, పురపాలక ఇంజినీర్ వై. వెంకటరమణ, సహాయ నగర ప్రణాళికా అధికారి జి. సీతారం, పురపాలక మేనేజర్ పి. ప్రసాదరావు, పట్టణ ప్రణాళికా అధికారి వి. జగదీశ్వరరావు, పర్యావరణ ఇంజినీర్ హరీష్, పారిశుధ్య తనిఖీ అధికారి సోమేశ్వరరావు, పురపాలక సిబ్బంది, పారిశుధ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ నగర్‌లో టీసీసీ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం విజయవంతం



**తల్లాడ మీ వార్త ప్రతినిధి సెప్టెంబర్ 17** మండలంలోని ఎన్టీఆర్ నగర్ కాలనీలో తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ టి సి సి జిల్లా ముఖ్య నాయకుల సమావేశం మండల అధ్యక్షుడు కే.వి. ఇజ్రాయిల్ అధ్యక్షతన, జిల్లా అధ్యక్షుడు గుంటి బాబురావు ఆధ్వర్యంలో ఘనంగా రిగింది.ప్రభుత్వానికి టిసిసి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ మానుకొండ సుదర్శనం మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వాన్ని కోరికలు డిమాండ్ చేశారు క్రైస్తవుల కోసం 3 ఎకరాల (శ్మశాన వాటిక) కేటాయించాలి. క్రైస్తవ భవనాన్ని నిర్మించాలి. 50 సంవత్సరాలు దాటిన క్రైస్తవులకు వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలి. ఇందిరమ్మ ఇల్లులు ఇవ్వాలని ఈ సమావేశంలో స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నిరీక్షణ రావు, రాష్ట్ర సెక్రెటరీ ఏసుదాస్, జిల్లా కార్యదర్శి రాజరత్నం, నూతన అధ్యక్షులు ప్రకాష్ రావు, సెక్రెటరీ రావూరి కృష్ణ, మహిళా సోదరీమణులు మరియు టీసీసీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నూతనకల్ లో బలవంతపు గోపమ్మ నివాళులు అర్పించిన తూము శ్రీనివాసరావు



**తల్లాడ మీ వార్త ప్రతినిధి.16 9.2026** నూతనకల్ గ్రామంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు బలవంతపు లోకేశ్వరావు తల్లి గారైన బలవంతపు గోపమ్మ గారు ఈ రోజు స్వర్గస్తులైనారు. ఈ విషయం తెలుసుకున్న నూతనకల్ , బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు గారు బలవంతపు లోకేశ్వరావు గారి ఇంటి యందు గోపమ్మగారి భౌతిక కాయాన్ని సందర్శించి పూల మాలతో నివాళులు అర్పించినారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారిని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు నారపోగు జమలయ్య, వార్డు మెంబర్ లు కిన్నెర కృష్ణ, అడపా సురేష్ పసుపులేటి ప్రభాకర్, కిన్నెర శ్రీనివాసరావు, మరియు గ్రామ నాయకులు కార్యకర్తలు యువత పాల్గొన్నారు.

## రైతులపై కక్ష సాధిస్తున్న కూటమి ప్రభుత్వం

వైసీపీ మండల అధ్యక్షుడు తాండ్ర రాజేష్ ..



**కుక్కునూరు, సెప్టెంబర్ 16 (మి వార్తా ప్రతినిధి)** :కుక్కునూరు వేలేరుపాడు మండలాల నిర్వాసిత రైతులకు యూరియా అందించకుండా కూటమి ప్రభుత్వం కక్ష సాధిస్తుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.రెండు మండలాల్లో పత్తి,మిర్చి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం తక్షణమే యూరియాను అందించాలని అయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముంపు భూములకు పరిహారం అందించామన్న కారణంతో రైతులకు యూరియా అందించకపోవడం సరికాదన్నారు. రైతులకు ఎరువులు అందకుండా చేస్తే వారి జీవనోపాధి దెబ్బతింటుందని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియాను అందించామని రాజేష్ తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వాసిత రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ముంపు పేరుతో యూరియా సరఫరాను నిలిపివేస్తే నిర్వాసిత రైతులు తమ కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. రైతుల పరిస్థితిని ప్రభుత్వం అర్థం చేసుకుని పత్తి ,మిర్చి సాగుకు అవసరమైన యూరియాను వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే రైతుల తరపున ఆందోళన చేపట్టేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు.

## ఎన్నికల పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే తెలపండి

ఎన్నికల పరిశీలకులు ప్రభాకర్



**పెంటపాడు సెప్టెంబర్ 16 (మీ వార్త ప్రతినిధి)**రానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు ప్రభాకర్ తెలిపారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎం. వెంకటేష్ అధ్యక్షతన బుధవారం అన్ని పార్టీలకు సంబంధించిన రాజకీయ నాయకులు, పార్టీ అధ్యక్షులతో సమావేశం జరిగింది.ఈ సమావేశంలో డీఎల్ డీవో ప్రభాకర్ మాట్లాడుతూ రానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చని అన్నారు.ఈ సమావేశానికి జనసేన పార్టీ మండల అధ్యక్షులు పుల్లా బాబీ, కట్టుబోయిన కృష్ణ ప్రసాద్,తెలుగుదేశం పార్టీ నుండి కిలపర్తి వెంకటరావు, బందారు వెంకట్రావు, బీజేపీ పార్టీ నుండి ఇమ్మంది శ్రీను, వైసీపీ పార్టీ నుండి పార్టీ మండల అధ్యక్షులు కైగాల శ్రీను,సీపీఎం పార్టీ నుండి చిర్ల పుల్లారెడ్డి, సిరపరపు రంగారావు పాల్గొన్నారు.

## సర్కిలపేట లో భక్తిశ్రద్ధలతో వి హెచ్ పి సత్సంగం--భజన కార్యక్రమం



**మచిలీపట్నం సెప్టెంబర్ 16 (మీ వార్త ప్రతినిధి)** విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా వారి సహకారంతో మొవ్వ మండలం సర్కిలపేటలోని శ్రీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం సామూహిక సత్సంగం భజన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 32 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని భజనలు, సత్సంగంలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తి గీతాలు ఆలపిస్తూ, భక్తి, ధార్మిక చైతన్యం, సామాజిక ఐక్యతను పెంపొందించే అంశాలపై సత్సంగం నిర్వహించారు.ఈ సందర్భంగా వి హెచ్ పి కృష్ణా జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూరగడ్డ శ్రీనాధ్ అమ్మవారికి నూతన వస్త్రాలను సమర్పించారు. అనంతరం అమ్మవారికి సమర్పించిన నూతన వస్త్రాలను లక్కీ డిప్‌లో ఎంపికైన శ్రీమతి లలితకు ఆలయ ధర్మకర్త శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, అయ్యప్ప ఆలయ పూజారి శ్రీ శేషు తదితరులు పాల్గొన్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొని భజనలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.గ్రామీణ ప్రాంతాల్లో సత్సంగాలు, భజనలు వంటి కార్యక్రమాల ద్వారా భక్తి భావనతో పాటు సామాజిక ఐక్యత, ధార్మిక చైతన్యం, పరస్పర సోదరభావాన్ని పెంపొందించేందుకు వి హెచ్ పి కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## లంబోదరుని కృప ప్రజలందరిపై ఉండాలి: పైబోయిన వెంకటరామయ్య

**తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 15 (మీ వార్త ప్రతినిధి)** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని కొండ్రుపోలు భగత్ సింగ్ కాలనీలో వడ్డెర కుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక



చవితి పందిరిని ల్యాండ్ లార్డ్ పైబోయిన వెంకటరామయ్య సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పందిరిలో కొలువుదీరిన విఘ్నేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం వెంకటరామయ్య మాట్లాడుతూ విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో ఆనందం, ఐశ్వర్యం వెల్లివిరియాలని, తాడేపల్లిగూడెం ప్రజలందరికీ సుఖశాంతులు,సుభిక్షం కలగాలని కోరుకుంటూ అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను, నిర్వాహకులను ఆయన అభినందించారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాన్ని నిర్వహించాలని త్సవ కమిటీ నిర్వాహకులకు ఆయన సూచించారు. తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సురేష్, పఠాన్ వల్లీ,ఓర్సు వెంకట్రావు, కూరాకుల వెంకటేశ్వరరావు, తమ్మిశెట్టి అంజిబాబు, వల్లేపు దుర్గారావు, వల్లేపు ప్రసాద్, గుంజె రవి, గోదేళ్ల శివకృష్ణ, తమ్మిశెట్టి దుర్గాప్రసాద్, నంద్యాల శ్రీను, నంద్యాల సాయి, వీర్ల గంగరాజు, ఉప్పు చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

## నూతనకల్ లో వంగూరి జమలమ్మ నివాళులు అర్పించిన సండ్ర వెంకట వీరయ్య

**తల్లాడ మీ వార్త ప్రతినిధి.** 16.9.2026 నూతనకల్ గ్రామంలో వంగూరి జమలమ్మ గారు ఇటీవల అనారోగ్యం కారణంగా స్వర్గస్థులైనారు, బుధవారం నిర్వహించిన జమలమ్మ గారి దశ దిన కార్యక్రమంలో



బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకట వీరయ్య గారు పాల్గొని వంగూరి జమలమ్మ గారి చిత్ర పటానికి పూలతో నివాళులు అర్పించినారు, అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పి వారిని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు, వైరా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నాయుడు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ శెట్టిపల్లి లక్ష్మణరావు, వేమిరెడ్డి సీతారామి రెడ్డి , నారపోగు జమలయ్య, వార్డు మెంబర్ లు కిన్నెర కృష్ణ, అడపా సురేష్,పసుపులేటి ప్రభాకర్, కిన్నెర శ్రీనివాసరావు , కిన్నెర నరసింహారావు మరియు ముఖ్య నాయకులు కార్యకర్తలు యువత పాల్గొన్నారు .

## న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వం స్పందించాలి.



**వేలేరుపాడు సెప్టెంబర్ 16(మి వార్తా ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులు వీఆర్ఏ లు సుమారు 20 వేలు మంది గ్రామస్థాయిలో తహశీల్దార్ కార్యాలయాల నందు ప్రభుత్వ విధులు నిర్వర్తిస్తున్నారు 9 సంవత్సరములుగా కేవలం ? 10500. వేతనంతో దుర్భర జీవితాలను గడుపుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గం అని వెంటనే సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని ఏపీ వీఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ మండల నాయకులు పిట్ట రమేష్, రాంబాబు, రాజు,
విఆర్ఏ లు సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. న్యాయమైన హక్కుల కోసం శాంతియుతంగా జరుగుతున్న ఉద్యమాలను ప్రభుత్వం గుర్తించి, చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం చూపాలని వారు ప్రభుత్వాని కోరారు. పేద ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి న్యాయం చేయాలన్నారు. ఉద్యమం విజయవంతం కావాలనీ న్యాయమైన డిమాండ్లు సాధించాలనీ ఇందుకు రాష్ట్రంలోని వీఆర్ఏలు అందరూ ఐక్యం తో కదిలి ఉద్యమాన్ని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# పార్టీ సిద్ధాంతాలు మేరకు పార్టీ నాయకత్వంతో కలసి పనిచేయాలి

**టీడీపీ లో చేరిన వైసీపీ కార్యకర్తలు**

**కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శిరీషాదేవి పార్టీ పరిశీలకులు కోట్ని బాలాజీ,స్థానిక సంస్థలు ఎన్నికల పరిశీలకులు కుదుపూడి సత్తిబాబు**







**చింతూరు / కూనవరం సెప్టెంబర్ 16 ( మీ వార్త ప్రతినిధి ):** స్థానిక సంస్థల ఎన్నికలను పార్టీ శ్రేణులు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పిలుపునిచ్చారు. విలీన మండలాల్లో బుధవారం ఆమె చింతూరు మరియు కూనవరం మండలాల్లో మండల పార్టీ విస్తృత స్థాయి సమావేశం కార్యక్రమాలు నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు ఎడవల్లి భాస్కర రావు మరియు జమాల్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశాల్లో ఆమె పాల్గొన్నారు. నియోజక వర్గ పార్టీ పరిశీలకులు కోట్ని బాలాజీ మరియు స్థానిక సంస్థలు ఎన్నికల పరిశీలకులు కదుపూడి సత్తిబాబు ల సౌజన్యంలో నిర్వహించిన సమావేశాల్లో తొలుత ఆమెకు పార్టీ శ్రేణులు అభిమానులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలని సూచించారు. పార్టీలో కష్టపడ్డ ప్రతీ కార్యకర్తను గుర్తించి వారి రాజకీయ భవిష్యత్తుకు మంచి బాటలు పడే రోజుకు సమీపించాయన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో అనుసరించాల్సిన విధి విధానాలపై క్షుణ్ణంగా వివరించారు. ప్రతీ బూత్ లో అత్యధిక మెజారిటీ ఓట్లు సాధించేలా కృషి చేయాలని సూచించారు. దానికి గానూ తనవంతుగా ఏమి చేయాలో అంతా ఎలాంటి లోపంలేకుండా చిత్తశుద్ధితో పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే పోలవరం జిల్లా వ్యాప్తంగా ఎన్నికల హామీలు మేరకు అన్నింటినీ అమలు చేసినట్లు పేర్కొన్నారు. ఇంకా ఎన్నికల్లో ఇవ్వని హామీలు కూడా అమలు చేసిన ఘనత కూటమిదే అన్నారు. కార్యకర్తలకు సముచిత స్థానం అందించే పార్టీ తెదేపా అని నియోజక వర్గ స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు కదుపూడి సత్తిబాబు మరియు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కోట్ని బాలాజీ లు స్పష్టం చేశారు. చింతూరు, కూనవరం మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వారు పలు సూచనలు సలహాలు చేశారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని కోరారు. ప్రతీ కార్యకర్త కష్టం అన్నీ తనకు తెలుసని వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కార్యకర్తలు వారు కష్టపడ్డ విధానాల ప్రకారం వారికి గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ధర్మానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అధిష్టానం ఆదేశాలు ప్రకారం కూటమికి కేటాయించిన స్థానాలను వారికి కేటాయించి మిగిలిన స్థానాల్లో పోటీచేయాల్సి ఉంటుందన్నారు. ఆయా స్థానాల్లో పోటీచేసే ఆసక్తిగల అభ్యర్థులు పూర్తి వివరాలతో త్వరలో రంపచోడవరం లో ఏర్పాటు చేసే సమావేశానికి ఆశావహులు అందరూ హాజరు కావాలని కోరారు.విలీన మండలాల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల ఉత్సాహం ఆశాజనకంగా ఉందని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. కూనవరం మండలం ముల్లూరు మరియు రేపాక గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షులు ఎడవల్లి భాస్కర రావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు హాజరైన ఆమెకు పార్టీ శ్రేణులు అభిమానులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆమెచేతులు మీదుగా తెలుగుదేశం పార్టీ జెండా స్థూపం ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ వార్డులో తెలుగుదేశం పార్టీ జెండా ఎగిరేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎంతగా పనిచేస్తే అంత గుర్తింపు ఇచ్చే పార్టీ తెలుగుదేశం అన్నారు. ప్రతీ కార్యకర్త అకుంఠిత దీక్షతో అన్ని ఎన్నికల్లో జెండా ఎగిరేలా చైతన్యం చేశారు. పార్టీ సిద్ధాంతాలు నచ్చి పార్టీలోకి వచ్చేవారికి సాదర స్వాగతం ఇస్తామని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. మండలంలోని చింతూరు మరియు కూనవరం మండలాల్లో బుధవారం మండల పార్టీ అధ్యక్షులు ఎడవల్లి భాస్కర రావు మరియు జమాల్ ఖాన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు నచ్చి ప్రాముఖ్యంగా పార్టీ సిద్ధాంతాలు నచ్చి పార్టీలోకి వచ్చే వారికి మంచి భవిష్యత్తు ఉందని పేర్కొన్నారు. నూతనంగా పార్టీలో చేరిన వారు స్థానిక శ్రేణులను కలుపుకొని పనిచేయాలని సూచించారు. అలాగే రానున్న ఎన్నికల్లో వారు కూటమి అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని సూచించారు. అప్పుడే వారి సామర్థ్యం ఎంతో ఏమిటో అనేది తెలుస్తుందన్నారు. అనంతరం ఆమె వారికి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నూతనంగా పార్టీలో చేరిన వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి కష్ట సుఖాల్లో తనవంతుగా బాధ్యతగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబురమేష్,వంతల రాజేశ్వరి, నియోజక వర్గ పార్టీ పరిశీలకులు కోట్ని బాలాజీ, స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు కుదుపూడి సత్తిబాబు, ఏ పి ఐ ఐ సి డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, మండల పార్టీ అధ్యక్షులు ఎడవల్లి భాస్కర రావు,షేక్ జమాల్ ఖాన్, జడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి పార్టీ శ్రేణులు , వివిధ అనుబంధ కమిటీల సభ్యులు , అధిక సంఖ్యలో అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికి 125 రోజుల పని తప్పనిసరి.

**డ్వామా పీడీ ఆదేశం.**



**అనంతగిరి,సెప్టెంబర్ 16 ( మీ వార్త )** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించుకున్న పనుల్లో 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా డ్వామా పీడీ విద్యాసాగర్ ఉపాధి సిబ్బందిని ఆదేశించారు.అనంతగిరి మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఆయన సిబ్బందితో అత్యవసర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.మండలంలో పనుల పురోగతి, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన చర్యలపై క్షేత్రస్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా పీడీ విద్యాసాగర్ మాట్లాడుతూ..జాబ్ కార్డ్ కలిగి ఉండి, పని కావాలని కోరే ప్రతి కుటుంబానికి ఈ ఆర్థిక సంవత్సరంలో తప్పనిసరిగా 125 రోజుల ఉపాధి కల్పించాలని స్పష్టం చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణే ధ్యేయంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు దక్కేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు.ఎక్కడా ఎటువంటి అలసత్వానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు.

**ప్లాంటేషన్ పనుల్లో వేగం పెంచాలి**

2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను మండలంలో మంజూరైన ప్లాంటేషన్ (మొక్కలు నాటే) పనులను మరింత వేగవంతం చేయాలని పీడీ ఆదేశించారు. వర్షాకాలం అనుకూలంగా ఉన్నందున నిర్దేశిత గడువులోగా ప్లాంటేషన్ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు,రికార్డులను ఎప్పటికప్పుడు పారదర్శకంగా అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో కూలీలకు అవసరమైన తాగునీరు, నీడ వంటి కనీస వసతులు కల్పించాలని సూచించారు.ఈ అత్యవసర సమీక్షా కార్యక్రమంలో ఏపీడి పవన్,స్థానిక ఏపీవోలు సన్యాసినాయుడు, అర్జున్,ఈసీ శోభన్,మండల టెక్నికల్ అసిస్టెంట్లు,కంప్యూటర్ ఆపరేటర్లు మరియు ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ప్రతి ఇంటా 'ఆశీర్వాద దీపం'

**కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పిలుపు**



**భీమవరం, సెప్టెంబర్ 16: మీ వార్త ప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం, అలాగే ఆయన 25 ఏళ్ల నిరంతర ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం 7 గంటలకు ప్రజలు తమ ఇళ్ల ముందు దీపాలు వెలిగించి 'ఆశీర్వాద దీపం' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ ప్రగతి కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రజలు ఆశీర్వాదం అందించాలని కోరారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా 13 ఏళ్ల పాటు, అనంతరం ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ దేశానికి అందించిన సేవలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, ఆయుష్మాన్ భారత్, పీఎం ఆవాస్ యోజన, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, ఉజ్వల యోజన వంటి పథకాలు పేదలు, అట్టడుగు వర్గాలకు ప్రయోజనం చేకూర్చాయని తెలిపారు. స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్ వంటి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో మార్పులకు దోహదపడ్డాయని అన్నారు. అదేవిధంగా డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, యూపీఐ చెల్లింపుల వ్యవస్థ, వందే భారత్ రైళ్లు, ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాలతో దేశ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం, నారీశక్తి వందన్ అధినియం వంటి నిర్ణయాలను ఆయన ప్రస్తావిస్తూ, ఇవి దేశ రాజకీయ, సామాజిక రంగాల్లో కీలక పరిణామాలని పేర్కొన్నారు. కోట్లాది ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో ప్రధాని మోదీ తన జీవితాన్ని దేశ, సమాజ సేవకు అంకితం చేశారని శ్రీనివాస వర్మ అన్నారు. దేశాభివృద్ధి, ప్రపంచ వేదికపై భారతదేశ ప్రాధాన్యతను పెంచే దిశగా సాగుతున్న ప్రధాని మోదీకి మద్దతుగా ప్రజలు 'ఆశీర్వాద దీపం' కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆళ్ల నానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



**ఏలూరు సెప్టెంబర్ 16 ( మీ వార్త ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి,మాజీ ఆరోగ్యశాఖ మంత్రి,మాజీ ఎమ్మెల్సీ ఆళ్ల కాళీ కృష్ణ (నాని) భౌతికకాయానికి తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆళ్ల నాని ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు.

# నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించిన మార్నింగ్ కాఫీ క్లబ్




**భీమవరం, సెప్టెంబర్ 16: మీ వార్త ప్రతినిధి:** పదవులు బాధ్యతలను మరింత పెంచుతాయని, ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం అభివృద్ధికి కమిటీ సభ్యులు కృషి చేయాలని మార్నింగ్ కాఫీ క్లబ్ ఫౌండర్, కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, కొత్త శ్రీనివాస్, పీఆర్వో భట్టిప్రోలు శ్రీనివాసరావు అన్నారు. భీమవరం డిఎన్నార్ కళాశాల రోడ్డులోని తాడిమళ్ళ వారి కాంప్లెక్స్ లో బుధవారం 2026-29 సంవత్సరంకు ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంకు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సత్కరించారు. ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం అధ్యక్షులు వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు బొండాడ సుబ్బారావు, కార్యదర్శులుగా తటవర్తి మంగరాజు (రాజు), పరుచూరి నాగేశ్వరరావు, కోశాధికారి కురిశెట్టి కాశీ విశ్వనాథ్ లను సత్కరించారు. కారుమూరి సత్యనారాయణ మూర్తి, కోట్ల నాని, కురిశెట్టి నాని మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఐక్యతను చాటుతూ సంఘ భవనంను మరింత అభివృద్ధి చేసుకోవాలని నూతన కమిటి సభ్యులను అభినందించారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన వర్తక సంఘంకి మంచి పేరు తీసుకువస్తామన్నారు.

# పోషణ మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలు



**భీమవరం: సెప్టెంబర్ 16: మీ వార్త ప్రతినిధి:** పోషణ మాసోత్సవాల సందర్భంగా భీమవరం అర్బన్, రూరల్ సెక్టార్ల పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. చీగిడిలపేటలో నిర్వహించిన కార్యక్రమంలో సమతుల ఆహారం, ఆహారంలో వైవిధ్యం, ప్రోటీన్ ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనానికి ప్రతిరోజూ వివిధ రకాల పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం అవసరమన్నారు. ధాన్యాలు, చిరుధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, పెరుగు, గింజలు, విత్తనాలను ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. తాజా వేడి భోజనం, సహజమైన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చన్నారు. చిన్న వయస్సు నుంచే సమతుల ఆహారపు అలవాట్లను పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఏఎంసీ కమిటీ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యం

**చిన అమిరం గ్రామంలో అండర్ గ్రౌండ్ సీసీ డ్రైన్ కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అంజిబాబు**



**భీమవరం: సెప్టెంబర్ 16: మీ వార్త ప్రతినిధి:** భీమవరం నియోజక వర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలం చిన అమిరం గ్రామంలో అండర్ గ్రౌండ్ సీసీ డ్రైన్ కు బుధవారం ఎమ్మెల్యే అంజిబాబు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. సుమారు రూ 35 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను చేపడుతున్నామని, ఈ గ్రామంలో ఇటీవలే సుమారు రూ 5 కోట్లతో ఎన్నో అభివృద్ధి పనులను ప్రారంభించుకున్నామని, ఆదర్శ గ్రామంగా చిన అమిరం గ్రామం అవార్డు కూడా సాధించడం మన ప్రాంతానికే గర్వకారణమని అన్నారు. ఇదే స్ఫూర్తితో అన్ని గ్రామాలను అభివృద్ధి చేసుకుని రాష్ట్రంలోనే భీమవరం నియోజవర్గాన్ని మొదటి వరుసలోకి తీసుకు వద్దామని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

Edited Printed Published & Owned by U. SHEKHAR. And Printed at Mani Raghava Printers, #A-20, Vambay Colony, Hyderabad, Rajendranagar, Rangareddy, Telangana.
Published at Manikanta Publications, H.No. 3-67/3/66, Netaji Nagar, Nallagandla, Serilingampally, Rangareddy (Dist), Telangana, EDITOR U.SHEKHAR, RNI. NO. TEL/2018/77112

# పెంటపాడులో వైసీపీ మండల స్థాయి విస్తృత సమావేశం

**పెంటపాడు, సెప్టెంబర్ 16 (మీ వార్త ప్రతినిధి)** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు గాను పెంటపాడులో వైసీపీ మండల స్థాయి విస్తృత సమావేశం ను పార్టీ మండల అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ నియోజకవర్గం సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు పార్టీ ఐడి కార్డులను వడ్డీ రఘురాం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో జాప్యం, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, 'వెన్నుపోటు పార్టీ.. వెన్నుపోటు పాలన' కార్యక్రమాన్ని గ్రామస్థాయి నుంచి విస్తృతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలను బలంగా ఎదుర్కోవాలని, 2014లో ఓడినా 2019లో కలిసికట్టుగా గెలిచినట్లే ఇప్పుడు కూడా ఐక్యంగా పనిచేయాలని అన్నారు. జగన్ పాలనలో కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేశామని, కానీ చేసిన మంచిని బలంగా




చెప్పుకోలేకపోయామని అన్నారు. కూటమి ప్రభుత్వ పాలన రెండేళ్లలోనే అవినీతి నిలయంగా మారిందని, మట్టి, ఇసుక, లిక్కర్ మాఫియా రాజ్యమేలుతోందని విమర్శించారు. అక్టోబర్ లేదా నవంబర్లో జరిగే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, సూపర్ సిక్స్ సహా 143 హామీలపై నిలదీయాలని సూచించారు. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలపై సీబీఐతో నిష్పాక్షిక విచారణ జరపాలని, నకిలీ సర్టిఫికెట్లు, తప్పుడు రిజర్వేషన్లతో మెగా డీఎస్సీ అక్రమాల పుట్టగా మారిందని ఆరోపించారు. దీనికి బాధ్యత వహిస్తూ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మండల నాయకులు, ఎంపీపీలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాలతో పోరాటలను అడ్డుకోలేరు







**సిఐటియు జిల్లాకార్యదర్శి ఎ.జె.రమేష్**
**నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ సామూహిక దీక్షలు**

**భద్రాద్రి :** సమరశీలపోరాటలకు సందంకండి పోరాటాల కు అండగావుంటాం ధీక్షలకు జూవీ,దీ=ాసహా ప్రజాసంఘాల మద్ధతుఈరోజు సీఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడెం రైల్వే స్టేషన్ సెంటర్ లో కార్మిక ప్రజా పోరాటాలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. బ్రహ్మాచారి అధ్యక్షులు జరిగిన సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ ప్రారంభించి మాట్లాడారు. లి లిగత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కార్మిక వర్గానికి అనేక హామీలు ఇచ్చి అమలు చేస్తామని తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు గడిచినప్పటికీ, కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలలోఒక్కహావ్నికూడచేయలేదన్నారు. కార్మికులకుఇచ్చినహావ్నిల అమలు పట్ల తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది విమర్శించారు. కార్మిక వర్గం తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన - పోరాటాలు చేస్తుంటే రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తో పాటు వివిధ జిల్లాల్లో తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. అర్ధరాత్రి పూట మహిళాకార్మికులఇండ్లకు వెళ్ళి దౌర్జన్యపూరితంగా వ్యహరిస్తున్నారని పెర్కొన్నారు. మహిళాకార్మికులంటే ప్రభుత్వానికి చులకన భావంవుందన్నారు. నిర్బంధం ఇదే రూపంలో కొనసాగిస్తే ప్రతిఘటన కూడా తీవ్రస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు భవిష్యత్తులో మరిన్ని సమరసిల పోరాటాలకు కార్మిక వర్గం సమయతమవుతుందని పేర్కొన్నారు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల ప్రకారం కార్మికుల వేతనాలు పెంచాలని స్కీమ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని రాష్ట్రంలోని ప్రతి కార్మికుడికి పిఎఫ్ ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు సమస్యల పరిష్కారం కోసం సిఐటియు తోటి రాష్ట్ర ముఖ్యమంత్రి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోతే గత పాలకులకు పట్టిన పరిస్థితి ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం లో కనీసం ధర్నా చేసుకునేందు కు కూడా అనుమతిని నిరాకరిస్తున్నారు. ఇది కార్మికుల హక్కులను అప్రాజాస్వామికంగా నిరాకరించటమేనని, ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదనిఅన్నారు. కార్మిక పోరాటాలకు సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు . లి2026 సెప్టెంబర్ 8,9తేదీల్లో జరిగిన అంగన్వాడీ,ఆశా రెండు సంఘాల "ఛలో హైదరాబాద్" పిలుపులను భగ్నం చేయడానికి కాంగ్రెస్ సర్కార్ పడరాని పాట్లు పడింది. వివిధ జిల్లాల్లో నాయకులను ఇండ్ల వద్దే ముందు రోజు రాత్రే అరెస్టులు చేశారు. సిఐటియు రాష్ట్ర నాయకులను సైతం తెల్లవారిఝూము నుండే వేటాడారు. వందలాది మంది పోలీసులు తమ బలగాలతో వచ్చి అక్రమ ముందస్తు అరెస్ట్ లకు పాల్పడుతున్నారు. పోలీసుల చర్యల మూలంగా ప్రజాస్వామ్యంలో చట్టబద్ధంగా పనిచేస్తున్న సిఐటియు నాయకులను సంఘ వ్యతిరేక శక్తులుగా చిత్రీకరించడమే. అన్నారు. నిర్బంధాన్నిఅరెస్టులను ఖండించారు. కార్మిక హక్కులపై కాంగ్రెస్ దాడి చేస్తుందని టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి పేర్కొన్నారు సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలకు కొత్తగూడెంలో సంఘీభావం తెలిపి రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయలేదు. మహిళలకు ఉచిత బస్సు, గృహజ్యోతి పథకం మినహా ఏ ఒక్క గ్యారంటీని అమలు చేయలేదు. ఆశా వర్కర్స్ రూ.18,000/-ల ఫిక్స్ వేతనం, పిఎఫ్ సౌకర్యం అమలు,గ్రామ పంచాయితీ, మున్సిపల్, విద్యుత్, ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్, బిల్డింగ్, హమాలీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు డిమాండ్ చేశారు. సమస్యలపరిష్కారంకోసం ఆందోళన- పోరాటాలు చేస్తున్నకార్మికులతోబాధ్యత కల్గిన రాష్ట్ర ప్రభుత్వం చర్చలుజరిపికార్మిక సమస్యలను పరిష్కరించాలని ,రైతు సంఘం ,జిల్లాకార్యదర్శి అన్నవరపు సత్యనారయణ, వ్యవసా య కార్మికసంఘంజిల్లా అధ్యక్షులు అన్నవరపుకనకయ్య నాయకులు సంజీవ్, ఐద్వానాయకు లక్ష్మి నాయకులు బాలరాజు,హరికృకష్ణ నాయకులు నాగకృష్ణ,=ా నాయకులు సురేష్,డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుండా ఆందో ళనా-పోరాటాలు నిర్వహిస్తున్న కార్మికులను అణచివేస్తూ తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించటాన్నిఖండించారు. సామూహిక దీక్ష ఈ కార్యక్రమం లో సీఐటీయూ జిల్లా జిల్లా కోశాధికారి జి పద్మ జిల్లా ఆఫీస్ బేరర్లు పిట్టల అర్జున్ దొడ్డ రవికుమార్ ఈసం వెంకటమ్మ భూక్య రమేష్ గద్దల శ్రీను సత్య రాజేష్ ధనలక్ష్మి జూవీనాయకులు మం.బి.నర్సారెడ్డి పాల్గొన్నారు దీక్షలో వందలాది మంది కార్మికులు కూర్చున్నారు కూర్చున్నారు.

# రూ.18 కోట్లు తెచ్చింది నేను..







**కంప్లైంట్ లు చేస్తూ పనులు ఆపించేది లోకల్ ఎమ్మెల్యే**
**నేను బిల్డింగ్ లు కూల్చకుండా బైపాస్ రోడ్ వేద్దామంటే లోకల్ ఎమ్మెల్యే అన్ని బిల్డింగ్ లు కూల్చాలంటున్నాడు.**

**సదాశివపేట :** 80 అడుగుల రోడ్డు కోసం 180 భవనాల కూల్చివేత అవసరమా? వారికి కోట్లలో నష్టపరిహారం చెల్లించడం సాధ్యమా? కూల్చివేతలు లేకుండా బైపాస్ రోడ్డు అభివృద్ధి చేస్తాం బిల్డింగ్ యజమానులకు, ఫుట్ పాత్ వ్యాపారులకు నష్టంజరగకుండా, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా రోడ్ నిర్మాణం జరుగుతుంది. హెచ్ఎండిఏ,మున్సిపల్ అధికారులు,కాంగ్రెస్ నాయకులతో కలిసి బై పాస్ రోడ్ లో కాలినడకన పర్యటించిన జగ్గారెడ్డి. సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డు లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మంగళవారం సాయంత్రం పర్యటించారు. బసవేశ్వర విగ్రహం నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకు హెచ్ఎండీఏ,మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి కాలినడకన రోడ్డును పరిశీలించారు. బైపాస్ రోడ్డుపై ప్రస్తుతం ఉన్న రహదారి విస్తీర్ణాన్ని మూలమూలన అధికారులతో కొలతలు తీయించారు. రోడ్డు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, సంగారెడ్డి బైపాస్ రోడ్డు అభివృద్ధి కోసం తాను రూ.18 కోట్ల నిధులు మంజూరు చేయించానని తెలిపారు. ప్రజలకు, వ్యాపారులకు ఎలాంటి నష్టం కలగకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నదే తన ఉద్దేశమన్నారు. "ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యే 80 అడుగుల రోడ్డు కోసం నిర్మాణాలను కూల్చివేయాలని చెబుతున్నారు. 80 అడుగుల రోడ్డు వేయాలంటే సుమారు 180 భవనాలు తొలగించాల్సి వస్తుంది. వారికి కోట్ల రూపాయల నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఆచరణలో సాధ్యమవుతుందా?" అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఎలాంటి కూల్చివేతలు లేకుండా 50 అడుగుల రోడ్డును అభివృద్ధి చేయవచ్చని, దీనివల్ల ప్రజల ఇళ్లు, దుకాణాలు, మెట్లు తొలగించాల్సిన అవసరం ఉండదని చెప్పారు. ప్రజలకు నష్టం కలిగించే నిర్ణయాల కంటే అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కోసం అధికారులు పనిచేయాలని సూచించారు. "నేను రూ.18 కోట్ల నిధులు తీసుకొచ్చి రోడ్డు పనులు చేస్తుంటే , స్థానిక ఎమ్మెల్యే మాత్రం ఇంట్లో కూర్చొని అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. హెచ్ఎండీఏ కమిషనర్కు ఫిర్యాదు చేయడంతో పనులు నిలిచిపోయాయన్నారు. విజిలెన్స్కు కూడా ఫిర్యాదులు చేస్తున్నారు. దీని వల్ల పనిచేయాల్సిన అధికారులు ఇబ్బందులు పడుతున్నారు" అని ఆయన అన్నారు. బైపాస్ రోడ్డు అభివృద్ధిపై స్థానిక ఎమ్మెల్యేకు నిజంగా 80 అడుగుల రోడ్డు అవసరమని భావిస్తే, ప్రజల మధ్యకు రావాలని, బైపాస్ రోడ్ లో ప్రజల వద్దకు వచ్చి కూల్చివేతలపై స్పష్టంగా మాట్లాడాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో ప్రజలకు ఆస్తి నష్టం కలిగించడం కాకుండా, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రహదారి విస్తరణ చేపట్టడం తన ఉద్దేశ్యం అన్నారు.

## వై.ఎస్.ఆర్.సి పార్టీ నాయకులకు ఐ.డి. కార్డుల పంపిణీ



**భీమవరం: సెప్టెంబర్ 16: మీ వార్త ప్రతినిధి:** వీరవాసరం మండలంలో వై.ఎస్.ఆర్.సి పార్టీ నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న ప్రతినిధులకు ఐ.డి. కార్డుల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించినట్లు భీమవరం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి చినిమిల్లి వెంకటరాయుడు తెలిపారు. ఎమ్మెల్సీ కవూరు శ్రీనివాస్ నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో పార్టీకి చెందిన వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, ప్రతినిధులకు ఐ.డి. కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్లమెంటరీ కార్యదర్శి వెంద్ర వెంకటస్వామి, వీరవాసరం మండల అధ్యక్షుడు చవాకుల సత్యనారాయణ, భీమవరం పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు డీవీడీ ప్రసాద్, రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి యెరకరాజు ఉమాశంకర్, రాష్ట్ర వైఎస్సార్టీయూసీ కార్యదర్శి వీరవల్లి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు.

## మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్న మ్మెల్యే దేవ వరప్రసాద్



**రాజోలు సెప్టెంబర్ 11 ( మీ వార్త విలేఖరి రవి).** మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ రాజోలులో డంపింగ్యార్డు ఏర్పాటుకు రెండున్నర ఎకరాల స్థలం కేటాయించామని తెలిపారు. సుమారు రూ.60 లక్షలతో డంపింగ్యార్డును అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అలాగే ఇంటింటికీ మంచినీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా, మురుగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బహుశా ప్రస్తుత సభ్యులకు ఇదే చివరి సమావేశం అని అన్నారు. మండలంలో ఇంకా పరిష్కారం కావాల్సిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సభ్యులు కృషి చేయాలని కోరారు. అనంతరం ఎంపీటీసీలను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## బిజెపి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో "సేవా సంకల్ప అభియాన్ "

**ప్రధాని మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామ దేవతలకు 108 కొబ్బరి కాయలతో ప్రత్యేక పూజలు**





**విజయవాడ, సెప్టెంబర్ 16 ( మీ వార్త ప్రతినిధి ):** ప్రధాని నరేంద్రమోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పన తలసురేష్ ఆధ్వర్యంలో "సేవ సంకల్ప అభియాన్ " లో భాగంగా వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్సీ కాలనీ లలో వెలసిన కుల దేవతలు, గ్రామ దేవతలకు ప్రధాని నరేంద్రమోడీ సుపరిపాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని భాజపా ఎస్సీ మోర్చా ఎన్టీఆర్ జిల్లా, పటమటలో గ్రామదేవత గంగనమ్మ గుడి వద్ద అట్టహాసంగా జరిగిన 108 కొబ్బరికాయలు కొట్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఇంచార్జ్ గా వ్యవహారిస్తున్న ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు వుల్లూరి గంగాధర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా , రాష్ట్ర ప్రోటోకాల్ ఇంచార్జి పాతూరి నాగభూషణం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతంశెట్టి నాగేశ్వరరావు,మువ్వల వెంకట సుబ్బయ్య పార్టీ అధికారప్రతినిధి షేక్ బాజీ, జిల్లా నాయకులు, మహిళా నాయకులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పాతూరి నాగ.భూషణం మాట్లాడుతూ రాష్ట్రములో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్ ఏ కార్యక్రమం చేసిన వినుత్నం గా, విజయవంతం గా నిర్వహిస్తున్నారని . ఈ కార్యక్రమానికి నన్ను ఆహ్వానించి అవకాశం కల్పించిన రాష్ట్ర మోర్చా ఉపాధ్యక్షులు వుల్లూరి గంగాధర్ తో పాటు ఈ కార్యక్రమం లో భాగస్వామ్యం అయిన పార్టీ నాయకులకు ధన్యవాదములు తెలిపారు.

## మరణవార్త



నా భర్త గారైన
**కీ.శే. సబ్బతి నీలయ్య** గారు
తండ్రి : అర్జునరావు గారు
01-01-1993 తేదీన
అనారోగ్య కారణంతో మరణించినారని
తెలియజేయడమైనది.

**వివరాలు**
కీ.శే. సబ్బతి నీలయ్య గారు
తండ్రి : అర్జునరావు గారు
మరణం: 01-01-1993

**చిరునామా**
నల్లవారిపేట,
సి.హెచ్. గున్నేపల్లి,
ముమ్మడివరం మండలం,
డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా,
ఆంధ్రప్రదేశ్.

ఇట్లు
భార్య
సబ్బతి చంద్రలక్ష్మి
సెల్: 9703182645